# చట్టం

సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

నిజామాబాద్
బుధవారం
03.06.2026

సంపుటి : 16 సంచిక: 248
పేజీలు:8 వెల: రూ.5

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్




## ఇండోనేషియా ఓపెన్‌లో అదిరే విజయం

భారత స్టార్ షట్లర్ పీవీ సింధు బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్‌లోకి దూసుకొచ్చింది. దాదాపు మూడేళ్ల తర్వాత పదో ర్యాంక్ సాధించింది తెలుగు తేజం. ఈమధ్య కాలంలో ఒక్కంటే ఒక్క టైటిల్ సాధించలేకపోయినప్పటికీ.. ఇండోనేషియా ఓపెన్‌లో అద్భుత విజయంతో సింధు టాప్-10లో చోటు సంపాదించింది. థాయ్‌లాండ్‌కు చెందిన బుసానన్ ఒంగ్‌బమ్రుంగ్ఫన్‌ను చిత్తు చేసిన భారత స్టార్ 16వ రౌండ్‌లో అడుగుపెట్టమే కాకుండా తన ర్యాంకింగ్‌ను మెరుగుపరచుకుంది. జూన్ 1 సోమవారం ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య(BWF) ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో సింధు 11వ స్థానంలో నిలిచింది. మంగళవారం వరస సెట్లలో థాయ్‌లాండ్ షట్లర్‌ను ఓడించడం ద్వారా ఒక స్థానం ఎగబాకి పదో ర్యాంక్‌ను సొంతం చేసుకుంది.

## పవన్‌కు కోమటిరెడ్డి వార్నింగ్

'తెలంగాణ ఎవరి జాగీరు కాదు'!

అమరవీరులను అవమానిస్తే సహించం: కోమటిరెడ్డి

పవన్ వ్యాఖ్యలపై మంత్రి తీవ్ర ఆగ్రహం

ఆంధ్రా కాంట్రాక్టర్లపై సంచలన వ్యాఖ్యలు

ఏపీ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచన



**చట్టం, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల వేళ జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర సినిమాటోగ్రఫీ, రోడ్లు & భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఘాటుగా స్పందించారు. తెలంగాణ రాష్ట్రమంతా సంబురాలు జరుపుకుంటున్న పవిత్రమైన రోజున, పక్క రాష్ట్ర డిప్యూటీ సీఎం ఇక్కడి గడ్డపై నిలబడి తన అక్కసు వెళ్లగక్కడం దుర్మార్గమని మండిపడ్డారు. తెలంగాణ అంటే పవన్ కళ్యాణ్‌కు అణువణువునా ఉన్న ద్వేషం, వివక్ష ఆయన మాటల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రాంతాన్ని ఉద్దేశించి పవన్ కళ్యాణ్ 'మీ అయ్య జాగీరా' అంటూ వాడిన భాష చూస్తుంటే తమ రక్తం మరుగుతోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలు తెలంగాణ సాధన కోసం ఆత్మబలిదానాలు చేసుకున్న వేలాది మంది అమరవీరులను ఘోరంగా అవమానించేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తాము మంత్రి పదవులను సైతం త్యాగం చేసి, ఆమరణ నిరాహార దీక్షలు చేసిన చరిత్ర గలవాళ్లమని గుర్తుచేశారు. ప్రస్తుతం టీడీపీ, బీజేపీలు కలిసి జట్టుగా చేరి తెలంగాణపై మళ్లీ కొత్త కుట్రలు చేస్తున్నాయనే అనుమానం తమకు కలుగుతోందని ఆయన వ్యాఖ్యానించారు. "ఇక్కడ వ్యాపారాలు చేసుకోండి, ఎవరూ అడ్డుకోరు. కానీ తెలంగాణ అస్థిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కించపరిస్తే మాత్రం అస్సలు సహించేది లేదు" అని మంత్రి స్పష్టం చేశారు. ఒకవేళ ఇక్కడి అస్థిత్వాన్ని దెబ్బతీయాలని చూస్తే ఆ తర్వాత జరిగే తీవ్ర పరిణామాలకు పవన్ కళ్యాణే బాధ్యత వహించాల్సి ఉంటుందని, తమ సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరించారు. అంతేకాకుండా, ఇకపై ఆంధ్రా కాంట్రాక్టర్లకు తెలంగాణలో ఒక్క ప్రాజెక్ట్ కూడా ఇవ్వబోమని, అవసరమైతే దీని కోసం ప్రత్యేకంగా కొత్త చట్టాన్ని తీసుకురావడానికైనా ప్రభుత్వం వెనకాడబోదని మంత్రి సంచలన ప్రకటన చేశారు. తెలంగాణ ప్రయోజనాల కోసం తాము ఎంతకైనా తెగిస్తామని తేల్చిచెప్పారు. ఆరుసార్లు చట్టసభలకు ఎన్నికైన ఒక సీనియర్ రాజకీయ నాయకుడిగా పవన్ కళ్యాణ్‌కు ఒక మంచి సలహా ఇస్తున్నానని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న పవన్ కళ్యాణ్, తెలంగాణలో రాజకీయ విద్వేషాలు రేపడం మానేసి తన సొంత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై దృష్టి సారిస్తే మంచిదని హితవు పలికారు. రెండు తెలుగు ప్రాంతాలు అభివృద్ధిలో పోటీపడాలి తప్ప, ఇలాంటి ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడటం సరికాదని హితవు పలుకుతూ.. "తస్మాత్ జాగ్రత్త" అని హెచ్చరించారు.



# కవిత భూపోరాటం

## మిలియన్ మార్చ్ తరహాలో పోరాటం

### ఉప్పల్ భగాయత్‌లో భారీ నిరసన

### జయశంకర్ విగ్రహం హైదరాబాద్‌లో ఏర్పాటు

### విగ్రహ స్థాపన ఖర్చులన్నీ మావే

### ఉద్యమకారుల హామీలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

### క్యాలెండర్ సెలవు కాదు.. ఆత్మగౌరవం

**తెలంగాణ ఉద్యమ చరిత్రలో మైలురాయిగా నిలిచిన మిలియన్ మార్చ్ తరహాలోనే మరో భారీ భూపోరాటానికి శ్రీకారం చుట్టనున్నట్లు టీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఆమె జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం సాగిన సుదీర్ఘ పోరాటాన్ని, అమరవీరుల త్యాగాలను లోతుగా గుర్తుచేసుకున్నారు.**

**చట్టం, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని దేశ స్వాతంత్ర పోరాటంతో పోల్చిన ఆమె, ఆనాటి ఉద్యమకారుల నిబద్ధతను ఎంతో కొనియాడారు. ప్రత్యేక రాష్ట్ర సాధన క్రమంలో ఎంతోమంది తమ సొంత ఆస్తులను, విలువైన ఉద్యోగాలను సైతం త్యాగం చేశారని గుర్తుచేశారు. అటువంటి కష్టకాలంలోనూ వెనకడుగు వేయకుండా పోరాటాన్ని సజీవంగా ఉంచిన ప్రతి ఒక్క ఉద్యమకారుడికి ఆమె శిరస్సు వంచి నమస్కరించారు. ప్రస్తుత ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని ఆమె మండిపడ్డారు. ఉద్యమకారుల సంక్షేమంపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టమైన ప్రకటన చేయకపోవడం తీవ్ర విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన మాటలను పక్కనబెట్టి కాలయాపన చేయడం సరైన పద్ధతి కాదని, తక్షణమే ప్రభుత్వం దీనిపై స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంత పునాదులు వేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందని కవిత ఉద్ఘాటించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగర గుండెకాయ లాంటి ప్రాంతంలో ఆయన విగ్రహాన్ని తప్పనిసరిగా ప్రతిష్ఠించాలని ఆమె కోరారు. జయశంకర్ సార్ ఆశయాలు, ఆయన చేసిన ప్రసంగాలు తెలంగాణ సమాజాన్ని ఏ విధంగా మేల్కొలిపాయో ఆమె వివరించారు. రాష్ట్రం సిద్ధించి ఇన్నేళ్లు గడుస్తున్నా ఆయనకు దక్కాల్సిన గౌరవం దక్కకపోవడం అన్యాయమని వాపోయారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఒక గొప్ప మేధావి విగ్రహ ఏర్పాటులో ఇంత జాప్యం జరగడం వెనుక ఉన్న నిర్లక్ష్యాన్ని ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. ఈ విగ్రహ ఏర్పాటు కోసం గతంలో తాము చేసిన ప్రయత్నాలను ఆమె సభలో కూలంకషంగా వివరించారు. రెండు వేల పద్నాలుగు (2014) సంవత్సరం నుంచే ఈ విషయమై నిరంతర ప్రయత్నాలు సాగుతున్నాయని ఆమె గుర్తుచేశారు. రెండు వేల పదిహేడు (2017)వ సంవత్సరంలో అప్పటి మున్సిపల్ శాఖకు అధికారికంగా లేఖ రాసినప్పటికీ ఆశించిన స్పందన రాలేదని ఆరోపించారు. ఒక మహనీయుడి విగ్రహం కోసం ఇన్నేళ్లుగా ఎదురుచూడాల్సి రావడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే తాజాగా మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాస్తూ విగ్రహ ఏర్పాటు ప్రాధాన్యతను వివరించినట్లు కవిత వెల్లడించారు. ఈ విగ్రహ స్థాపనకు అయ్యే పూర్తి ఖర్చును, ఆ తర్వాత దాని నిర్వహణ బాధ్యతలను తామే స్వయంగా చూసుకుంటామని ప్రభుత్వానికి స్పష్టం చేశారు. రాబోయే ఆగస్టు ఆరవ (6) తేదీన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ఉన్నందున, ఆ లోపే విగ్రహ ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేయాలని ఆమె గడువు విధించారు. మున్సిపల్ శాఖకు చెందిన ఉన్నతాధికారులు ఈ విషయాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. అధికారులు తక్షణమే ఫైళ్లను కదిలించి ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. జూన్ రెండవ (2) తేదీన జరుపుకునే ఆవిర్భావ దినోత్సవం అనేది కేవలం క్యాలెండర్‌లో ఒక ప్రభుత్వ

మిగతా 2లో..

### పవన్ కళ్యాణ్ చదువుతోంది

## మోడీ రాసిచ్చిన స్క్రిప్ట్

- పవన్ వ్యాఖ్యలపై జగదీశ్ రెడ్డి తీవ్ర ఆగ్రహం
- 'మోడీ రాసిచ్చిన స్క్రిప్‌ట్‌నే చదువుతున్నారు' అంటూ విమర్శలు
- తెలంగాణ అస్తిత్వాన్ని అవమానిస్తే సహించబోమని హెచ్చరిక
- జనసేన రాజకీయాలపై బీఆర్ఎస్ నేత ఘాటు వ్యాఖ్యలు

**చట్టం, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును, ఇక్కడి ప్రజల అస్తిత్వాన్ని అవహేళన చేసేలా మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి హెచ్చరించారు. నల్గొండ జిల్లాలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పవన్ కళ్యాణ్ స్వంతంగా ఏమీ మాట్లాడటం లేదని, ప్రధాని నరేంద్ర మోడీ రాసిచ్చిన స్క్రిప్ట్‌ను ఇక్కడ చదువుతున్నారని, ఆయనను చూస్తుంటే మోడీ ఏజెంట్‌లా అనిపిస్తోందని జగదీశ్ రెడ్డి ఎద్దేవా చేశారు. సినిమాల్లో చెప్పే డైలాగులను రాజకీయాల్లో మాట్లాడటం పవన్ కళ్యాణ్‌కు అలవాటుగా మారిందని జగదీశ్ రెడ్డి విమర్శించారు. తనను ఎవరో అడ్డుకున్నారని గాల్లో మాటలు చెప్పడం సరికాదని, అసలు ఆయనను ఎవరు, ఎక్కడ అడ్డుకున్నారో స్పష్టంగా చెప్పాలని నిలదీశారు. పవన్ కళ్యాణ్ అయినా, ఆయన కుటుంబమైనా తెలంగాణ ప్రజల ఆదరణ, భిక్ష వల్లే ఈ రోజు సినిమా రంగంలో ఇంతలా బాగుపడ్డారనే నిజాన్ని మరిచిపోకూడదని గుర్తుచేశారు. అలాంటిది ఇప్పుడు ఇక్కడికి వచ్చి తెలంగాణ సమాజాన్ని తక్కువ చేసి మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ప్రస్తుతం తెలంగాణ ఎదుర్కొంటున్న అసలైన సమస్యలను, ప్రజల దృష్టిని పక్కదారి పట్టించేందుకే పవన్ కళ్యాణ్‌తో ఈ విధమైన రాజకీయ డ్రామాలు ఆడిస్తున్నారని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. గతంలో తెలంగాణలో జనసేన పార్టీ తరఫున పోటీ చేసినప్పుడు పవన్ కళ్యాణ్‌కు ఎన్ని ఓట్లు వచ్చాయో, ఇక్కడి ప్రజలు ఆయనను ఎంతవరకు ఆదరించారో ఒకసారి వెనక్కి తిరిగి చూసుకోవాలని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజలు రాజకీయంగా ఎంతో చైతన్యవంతులని, పవన్ కళ్యాణ్ చెప్పే కట్టుకథలను గానీ, ఆయన మాటలను గానీ నమ్మే పరిస్థితిలో ఇక్కడి సమాజం లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజల గురించి మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకుని, జాగ్రత్తగా మాట్లాడాలని జగదీశ్ రెడ్డి హెచ్చరించారు.



## తెలంగాణ మా అయ్యా జాగిరే

- పవన్ వ్యాఖ్యలపై పొన్నం ప్రభాకర్ ఫైర్
- 'తెలంగాణ మా అయ్యా జాగిరే' అంటూ ఘాటు కౌంటర్
- గద్దర్‌పై వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్
- 'పెయిడ్ ఆర్టిస్ట్' అంటూ జనసేన అధినేతపై విమర్శలు

**చట్టం, స్టేట్ బ్యూరో:**



తాము ఏ అహంకారానికి వ్యతిరేకంగానైతే ఉద్యమ కాలంలో పోరాడామో, ఇప్పుడు అదే అహంకారపూరితమైన భాషను కొందరు మాట్లాడుతున్నారని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉద్యమకారుడు గద్దర్ గురించి పవన్ కళ్యాణ్ మాట్లాడిన తీరును దళిత సంఘాలు తీవ్రంగా ఆలోచించాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. తెలంగాణ మా అయ్యా జాగిరే అంటూ పవన్ కు కౌంటర్ ఇచ్చిన మంత్రి పొన్నం.. తెలంగాణ అమరవీరుల త్యాగాల గురించి గానీ, వారి కుటుంబాల సంక్షేమం గురించి గానీ పవన్ కళ్యాణ్ ఎప్పుడైనా మాట్లాడారా అని ప్రశ్నించారు. జగిత్యాల జిల్లాలోని కొండగట్టు అంజన్న ఆలయ అభివృద్ధికి గతంలో ప్రకటించిన నిధులపై మాట్లాడిన పవన్, ఆ నిధులేమైనా 'మీ అయ్యా జాగీరా' అంటూ ఘాటుగా స్పందించారు. పవన్ కళ్యాణ్ ఒక పెయిడ్ ఆర్టిస్ట్ లాగా వ్యవహరిస్తున్నారని ఆరోపించిన మంత్రి, ఆయనకు అందుతున్న పొలిటికల్ స్క్రిప్ట్‌లు బీఆర్ఎస్ కార్యాలయం నుండి వస్తున్నాయో లేక బీజేపీ ఆఫీస్ నుండి వస్తున్నాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక కీలక నేతగా పవన్ కళ్యాణ్‌కు తెలంగాణలో కేవలం ఒక గెస్ట్ (అతిథి) గా మాత్రమే ప్రోటోకాల్ గౌరవాన్ని కల్పించామని మంత్రి గుర్తు చేశారు. అలాంటప్పుడు తెలంగాణ నవనిర్మాణం పేరుతో ఇక్కడికి వచ్చి ఆయన పీకేదేంటని నిలదీశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం లాంటి పవిత్రమైన రోజున కావాలనే ఇక్కడికి వచ్చి గెలికే ప్రయత్నం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రాంతంలో ఆంధ్ర ప్రాంతం వారు తిరగకూడదని తాము ఎక్కడా అనడం లేదని, ఇక్కడ ఆంధ్రా వాళ్లకు ఏం పని ఉందని కూడా తాము ప్రశ్నించడం లేదని, కానీ తెలంగాణ అస్తిత్వాన్ని అవమానిస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ప్రముఖ ప్రజాగాయకుడు గద్దర్ విషయంలో పవన్ కళ్యాణ్ మాట్లాడిన అనుచిత వ్యాఖ్యలపై ఆయన తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ గట్టిగా డిమాండ్ చేశారు

### 'ఐ లవ్ ఇండియా.. ఐ లవ్ మోడీ"

## సోషల్ మీడియా

- భారతదేశంపై, ప్రధాని మోడీపై ట్రంప్ ప్రశంసలు
- 'ఐ లవ్ ఇండియా.. ఐ లవ్ మోడీ" అంటూ పోస్ట్
- ఇరుదేశాల మధ్య సంబంధాలు బలంగా ఉన్నట్లు సంకేతాలు

**చట్టం, స్టేట్ బ్యూరో:**



అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. మరోసారి భారతదేశంపై, ప్రధాని మోడీపై ప్రశంసలు కురిపించారు. ఈ మేరకు తన సొంత ట్రూత్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయంలో "ఫ్రీడమ్ ఎట్ 250" వేడుకలు జరిగాయి. అమెరికా స్వాతంత్ర్య 250వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి భారత, అమెరికా ఉన్నతాధికారులంతా హాజరయ్యారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, భారత విదేశాంగ మంత్రి జైశంకర్ సహా సుమారు 1,500 మంది అతిథులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఆర్.రెహ్మాన్ సంగీత కచేరి అలరించింది. ఈ వేడుకల సందర్భంగా అధ్యక్షుడు ట్రంప్ అకస్మాత్తుగా రాయబారి సెర్గియా గోర్‌కు ఫోన్ కాల్ చేశారు. వేడుకలకు హాజరైన అతిథులను ఉద్దేశించి ట్రంప్ మాట్లాడుతూ.. భారత్‌పై ప్రశంసలు కురిపించారు. "నాకు భారత్ అంటే చాలా ఇష్టం. భారత్‌తో అమెరికా సంబంధాలు మరింత బలపడాలి" అని వ్యాఖ్యానించినట్లు సమాచారం. అలాగే ప్రధాని మోడీ నాయకత్వాన్ని కూడా ప్రశంసించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఓ జాతీయ మీడియాలో కథనాన్ని ప్రచురించింది. ఇందుకు సంబంధించిన వీడియో క్లిప్‌ను తాజాగా ట్రూత్ సోషల్ మీడియాలో ట్రంప్ షేర్ చేశారు. దీంతో రెండు దేశాలకు సంబంధించిన సంబంధాలపై చర్చకు వస్తున్నాయి. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలంగా ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం రెండు దేశాల మధ్య సంబంధాలు బలపడుతున్నాయి. ఆ మధ్య కొంత కాలం విభేదాలు ఉన్నప్పటికీ ఇప్పుడు సర్దుకుపోయినట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం సంబంధాలు బలపడినట్లుగా సమాచారం. అంతేకాకుండా ప్రస్తుతం భారత్‌అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందాలపై కీలక చర్చలు కొనసాగుతున్నాయి. సుంకాలు, మార్కెట్ యాక్సెస్, ప్రాంతీయ భద్రత వంటి అంశాలపై ఇరు దేశాల అధికారులు చర్చలు జరుపుతున్న తరుణంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

### చీలిక దిశగా మమత పార్టీ..

## 50 మంది ఎమ్మెల్యేలు గుడ్ బై

- మమతా బెనర్జీకి షాక్
- తృణమూల్ కాంగ్రెస్‌తో తీవ్ర సంక్షోభం
- మమతకు గుడ్ బై చెప్పనున్న 50 మంది ఎమ్మెల్యేలు
- రీటబ్రత బెనర్జీ నేతృత్వంలో పార్టీని చేజిక్కించుకునే ఛాన్స్

**చట్టం, స్టేట్ బ్యూరో:**

తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రి, మాజీ సీఎం మమతా బెనర్జీ కోటలు కూలిపోతున్నాయి. ఆమె పార్టీ ఆమె చేజారే పరిస్థితి నెలకొంది. టీఎంసీ ఎమ్మెల్యేల్లో మెజారిటీ ఎమ్మెల్యేలు తిరుగుబాటుకు రెడీ అయ్యారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. టీఎంసీ బహిష్కృత ఎమ్మెల్యే రిటబ్రత బెనర్జీ నాయకత్వంలో పార్టీని చేజిక్కించుకునేలా పావులు కదుపుతున్నట్లు వినికిడి. స్వయంగా మమతా బెనర్జీ సమావేశాలు పెట్టినా, ఎమ్మెల్యేలు రావడం లేదు. మంగళవారం కోల్‌కతాలో జరిగిన ధర్నాకు కేవలం 5 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలు మాత్రమే హాజరయ్యారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో 80 మంది టీఎంసీ నుంచి గెలుపొందారు. టీఎంసీ జాతీయ అధికార ప్రతినిధి రిజు దత్తా సంచలన విషయాలు వెల్లడించారు. టీఎంసీలో సంక్షోభం తీవ్రమైనట్లు చెప్పారు. సుమారు 50 మంది ఎమ్మెల్యేలు మమతా బెనర్జీకి షాక్ ఇచ్చి, పార్టీకి చెందిన "రెండు పువ్వుల" ఎన్నికల గుర్తు, పార్టీని దక్కించుకునే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిపారు. రిజు దత్తాను ఇప్పటికే టీఎంసీ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని 6 ఏళ్ల పాటు సస్పెండ్ చేసింది. దక్షిణ కోల్‌కతాలోని ఒక హోటల్‌లో ఎమ్మెల్యేలు రీటబ్రత బెనర్జీ, సందీపన్ సాహా పలువురు ఇతర ఎమ్మెల్యేలతో రహస్య సమావేశం నిర్వహించారని టీఎంసీ నాయకుడు కునాల్ ఘోష్ ఆరోపించారు. అయితే, ఈ వార్తల్ని రీటబ్రత ఖండించారు. జూన్ 18 తేదీన బెంగాల్ అసెంబ్లీ బడ్జెట్ సెషన్ లోపే టీఎంసీ విచ్ఛిన్నమవుతుందనే వార్తలు వస్తున్నాయి. అంతకు ముందు, అభిషేక్ బెనర్జీపై దాడి జరిగిన రోజు మమతా తన నివాసంలో సమావేశానికి పిలుపునిస్తే 80 మంది ఎమ్మెల్యేలకు గానూ కేవలం 20 మందే హాజరయ్యారు. దీంతో సమావేశం రద్దు చేసుకోవాల్సి వచ్చింది. దీనికి ముందు ఒక ధర్నాకు కేవలం33 మంది మాత్రమే వచ్చారు. ఇలా రోజు రోజుకు మమత తన ఎమ్మెల్యేలను కోల్పోతున్నారు.



## అమరవీరుల త్యాగాలే తెలంగాణ ప్రగతికి పునాది : అధికారులు



**చట్టం, బోధన్:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బోధన్ పట్టణం లోని ప్రభుత్వ కార్యాలయాల్లో సోమవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో ఎం. విజయకుమారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విట్టల్, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జాదవ్ కృష్ణ జాతీయ జెండాను ఎగురవేసి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వ్యవసాయం, సాగునీరు, విద్య, వైద్యం, మౌలిక వసతులు, సంక్షేమ రంగాల్లో విశేష అభివృద్ధి సాధించిందన్నారు. ప్రత్యేక తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులను స్మరించుకుంటూ, రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు.

## ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

- **జాతీయ జెండాను ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**చట్టం న్యూస్, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జిల్లా పోలీస్ భవన్ సమీపంలోని పరేడ్ గ్రౌండ్ లో మంగళవారం నిర్వహించగా, ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ముందుగా సిరిసిల్లలోని పాత బస్ స్టాండ్ సమీపంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తదితరులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం పరేడ్ గ్రౌండ్లో జాతీయ జెండాను ప్రభుత్వ విప్ ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా సందేశాన్ని వినిపించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు.

**స్టాల్స్ పరిశీలన:** అటవీ శాఖ, డీఆర్డీఓ, పోలీస్ శాఖ, పౌర సంబంధాల శాఖల ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్, ఎస్పీ పరిశీలించి.. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పర్యావరణ ఉత్సవాల కింద అటవీ శాఖ ఆద్వర్యంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్.బి గితే, అధికారులు మొక్కలు నాటారు.

## బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు






**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** వేములవాడలో బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో ప్రతాప రామకృష్ణ జెండా ఆవిష్కరించగా, భీమేశ్వర రిసార్ట్స్ వద్ద 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 12 జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్, రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణలు మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధికి బీజేపీకి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కుమ్మరి శంకర్, సంటి మహేష్, జిల్లా నాయకులు రేగుల మల్లికార్జున్, వైభవ్, బాలరాజ్, బోనాల శివ, కట్కం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు



**చట్టం నారాయణరావుపేట :** నారాయణరావుపేట, మండలం, ఇబ్రహీంపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ వద్ద తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామ సర్పంచ్ జాతీయ జెండాని ఎగరవేయడం జరిగింది. ఈరోజు మనం జరుపుకుంటున్నటువంటి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఎందరో అమరవీరులు పోరాటం చేసి వారి ప్రాణాలను త్యాగం ఫలితంగా లభించింది అని గ్రామ ప్రజలు తెలపడం జరిగింది. అదేవిధంగా ప్రతి ఒక్కరు సామాజిక తెలంగాణ వైపు అడుగు వేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంభాల లక్ష్మీ రాఘవరెడ్డి, ఉపసర్పంచ్, వార్డ్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు, యువకులు మహిళలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపూర్ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు



**చట్టం నారాయణరావుపేట :** నారాయణరావుపేట మండలం ఇబ్రహీంపూర్ గ్రామంలోని, ప్రాథమికోన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, బండి నరసింహులు జాతీయ జెండాను, ఎగరవేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం ఎన్నో ఉద్యమాలు, బలిదానాలు, అమరుల త్యాగఫలం అని పేర్కొనడం జరిగింది. తెలంగాణ అమరవీరులకు జోహార్ నినాదాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి నరసింహులు ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామ సర్పంచ్, కుంభాల లక్ష్మీ రాఘవరెడ్డి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, రేషన్ డీలర్, పెద్దలు, యువకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బాలికల ఉన్నత పాఠశాల భవిష్యత్ కి మంచి బాట

- **కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శోభారాణి**



**చట్టం న్యూస్ లింగంపేట్ :** లింగంపేట్ మండలంలో బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థుల భవిష్యత్ కి మంచి బాట లాంటిది అని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శోభారాణి అన్నారు. జూన్ 2 తెలంగాణా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇటీవల త్రిబుల్ ఐ టి ఎనికైనా జి.శృతిని అభినదిస్తూ అన్నారు. ఇలా తమ పాఠశాల నుండి ప్రతి సంవత్సరం విద్యార్థులు ఎన్నిక కావడం సంతోషని వ్యక్తం వ్యక్తం చేశారు. తమ పాఠశాలలో చదివిన చాలా మంది విద్యార్థులు ఉన్నత చదువు చదివి వివిధ ఉద్యోగాలు చేస్తున్నారు అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదవడం వలన త్రిబుల్ ఐ టి లాంటి కాలేజ్ లో సీట్ రావడం శృతి నిదర్శనం అని, విద్యార్థులకు ఉత్తమ బోధన అందించిన ఉపాధ్యాయుల కృషికి మరియు తల్లిదండ్రుల ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగంలో స్థిరపడాలని తెలిపినారు. కార్యక్రమం సినియర్ టీచర్ అపర్ణ, ఉపాధ్యాయులు, సీఆర్పీ సత్యనారాయణ, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# కవిత భూపోరాటం




మొదటిపేజీ తరువాయి

సెలవు దినం మాత్రమే కాదని ఆమె అభిప్రాయపడ్డారు. ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, సొంత గుర్తింపునకు, భాషా స్వేచ్ఛకు ప్రతీకగా నిలిచే ఒక చారిత్రాత్మక రోజని కొనియాడారు. తెలంగాణ పోరాట మహోజ్వల చరిత్రను ప్రస్తుత యువతకు, రాబోయే కొత్త తరాలకు విస్తృతంగా చేరవేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని కవిత పిలుపునిచ్చారు. ప్రస్తుత ప్రభుత్వ వైఖరిపై ఆమె తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. జూన్ రెండు (2) నాటి అధికారిక వేడుకల్లో ఉద్యమకారుల దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అందరూ ఆశించారని తెలిపారు. ప్రభుత్వం ఆ వేదికలపై నుంచి ఎలాంటి సానుకూల ప్రకటనలు చేయకపోవడం ఉద్యమకారులను తీవ్ర నిరాశకు గురిచేసిందని అన్నారు. ప్రభుత్వ ఈ ఉదాసీన వైఖరికి నిరసనగా రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున భూపోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. ఇందులో భాగంగానే జూలై రెండవ (2) తేదీన ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో ఒక భారీ భూపోరాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆమె అధికారికంగా ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని ఏ ఒక్క పార్టీకో లేదా వర్గానికో పరిమితం చేయడం లేదని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలోని మేధావులు, ఉద్యోగ సంఘాల నాయకులు, విద్యార్థి లోకం, న్యాయవాదులు, మీడియా ప్రతినిధులు తరలిరావాలని పిలుపునిచ్చారు. తెలంగాణను ప్రేమించే ప్రతి ఒక్క పౌరుడు ఈ పోరాటంలో భాగస్వామి కావాలని కోరారు. ఉప్పల్ భగాయత్ వేదికగా సాగే ఈ ప్రదర్శన ప్రభుత్వ కళ్ళు తెరిపించేలా ఉంటుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగేది లేదని కవిత స్పష్టం చేశారు. అమరవీరుల త్యాగాలను గౌరవించడం, వారి కుటుంబాలను ఆదుకోవడం సమాజ ప్రథమ కర్తవ్యంగా భావిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఉద్యమకారులందరినీ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి ప్రక్రియలో కీలక భాగస్వాములను చేస్తామని హామీ ఇచ్చారు. స్వరాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన హస్తాలు నేడు నిర్లక్ష్యానికి గురికావడం భావ్యం కాదని అన్నారు. హక్కుల సాధన కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధమని ఆమె ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఉద్యమ కాలం నాటి ఉత్సాహాన్ని, పట్టుదలను మరోసారి ప్రదర్శించాల్సిన సమయం ఆసన్నమైందని కవిత కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. అధికారంలో ఉన్నవారు ప్రజల ఆకాంక్షలను మరిచిపోతే ఎలా బుద్ధి చెప్పాలో తెలంగాణ సమాజానికి బాగా తెలుసని అన్నారు. భూపోరాటం ద్వారా ఉపాధి కోల్పోయిన పేదలకు, ఇళ్లు లేని అర్హులకు న్యాయం జరిగేలా ఒత్తిడి తీసుకువస్తామని చెప్పారు. జూలై రెండు (2) నాటి ఉప్పల్ భగాయత్ సభ ఈ నూతన పోరాటానికి ఒక బలమైన పునాది కాబోతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వాలు మారినా ప్రజల ఆశయాలు, ఉద్యమకారుల ఆకాంక్షలు మారవని గుర్తుచేశారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని కోరారు. లేనిపక్షంలో జూలై నుండి ప్రారంభమయ్యే ప్రజా ఆందోళనలు రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం అవుతాయని కవిత హెచ్చరించారు.

## అలయ్ బలయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎండల లక్ష్మీనారాయణకు ఘన సన్మానం

**చట్టం, నిజామాబాద్ ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలోని అలయ్ బలయ్ ఫౌండేషన్ తెలంగాణ ఉద్యమకారులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే, మాజీ బీజేపీ శాసనసభాపక్ష నేత ఎండల లక్ష్మీనారాయణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో ఎండల లక్ష్మీనారాయణ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం ఉద్యమ చరిత్రలో



కీలక ఘట్టమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం బీజేపీ వైఖరిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు. తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటికీ పదవిపై వ్యామోహం చూపకుండా తెలంగాణ సాధనే లక్ష్యంగా రాజీనామా చేసి, అనంతరం ఉప ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొందడం ఆయన నాయకత్వానికి నిదర్శనమని తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు మాట్లాడుతూ ఎండల లక్ష్మీనారాయణ చిన్ననాటి నుంచే సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన కార్యకర్త అని అన్నారు. రాజకీయ ఒత్తిడులను తట్టుకుని కాంగ్రెస్ నాయకత్వాన్ని ఎన్నికల్లో ఓడించడం ద్వారా తెలంగాణ ఉద్యమ బలాన్ని ఢిల్లీకి చాటిచెప్పారని గుర్తుచేశారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నాయకులను సన్మానించుకోవడం గర్వకారణమని అన్నారు. ఎండల లక్ష్మీనారాయణ చేసిన త్యాగాలను గుర్తుచేసుకుంటూ ఆయనకు సన్మానం చేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. సన్మానానికి స్పందించిన ఎండల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అలయ్ బలయ్ ఫౌండేషన్ తెలంగాణలో అన్ని వర్గాలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులను కలుపుతూ సామాజిక సమైక్యత కోసం కృషి చేస్తోందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ సన్మానం అందుకోవడం గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు, జేపీసీ నాయకులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, ఏబీవీపీ మాజీ అఖిల భారతీయ అధ్యక్షుడు మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**చట్టం న్యూస్ , వేములవాడ రూరల్ :**

ఎందరో మహానుభావుల త్యాగాలు, బలిదానాలు పోరాటాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో గుమ్మి పుల్లయ్య భవన్లో వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ కదారి రాములు సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కదారి రాములు మాట్లాడుతూ తెలంగాణ పోరాటంలో సిపిఐ పార్టీ ఎనలేని పోరాటం చేసిందని, విద్యార్థులు, తెలంగాణ వాదులు, మేధావులు ప్రాణ త్యాగాలు చేసి, సకలజనుల సమ్మెలు చేసి పోరాడి తెచ్చుకున్నది ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అని ఆయన గుర్తు చేశారు. మధ్యన భోజన కార్మికులకు పదివేల గౌరవ వేతనం అందడం లేదని, మున్సిపల్ గ్రామపంచాయతీ దేవస్థానం కార్మికులకు కాంటాక్ట్ బేసిక్స్ పోయి పర్మినెంట్ చేయాలని కనీస వేతనాలు రూ,26000 ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పిఎఫ్ ,ఈఎస్ఐ బోనస్ అమలు కావాలని, తెలంగాణలో ఉన్న అన్ని రకాల కార్మికులు, ఉద్యోగులకు న్యాయం చేసినప్పుడే నిజమైన తెలంగాణ అని అన్నారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఎల్లా దేవరాజు నాయకులు గాజుల పోశెట్టి ,పందుగ పోషాలు, కోరే శ్రీను, దప్పు శ్రీను ,క్రాంతి చందన్, పందుగ చంద్రయ్య, రాజు పెంట మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో..**

వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎందరో మహానుభావుల బలిదానాలు పోరాటాల ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఖమ్మం గణేష్ ,వస్తాది కృష్ణ, దైత కుమార్, విద్యాసాగర్, సిబ్బంది నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు ఎలక్ట్రిక్ ఆటోలు దోహదం

- **ఆటో డ్రైవర్గా అదనపు కలెక్టర్..**
- **ఆటోలో ప్రయాణించిన జిల్లా కలెక్టర్**

**చట్టం మెదక్ ప్రతినిధి :**

మహిళలు రవాణా రంగంలోకి ప్రవేశించడం ద్వారా మహిళా సాధికారత మరింత పెరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. ఆజీవిక గ్రామీణ ఎక్స్ప్రెస్ యోజన (AGEY) పథకం కింద రూ.3.35 లక్షల విలువైన మహీంద్రా ఎలక్ట్రిక్ ఆటోను మక్తా భూపతిపూర్ గ్రామానికి చెందిన కే. సంధ్యారాణికి మంగళవారం కలెక్టరేట్ లో పంపిణీ చేశారు. ఉపాధి అవకాశాల కోసం రెండేళ్ల క్రితం గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న సంధ్యారాణి అర్హతలను పరిశీలించిన అనంతరం ఆమెకు ఎలక్ట్రిక్ ఆటోను మంజూరు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా వెనుకబడిన గ్రామీణ ప్రాంతాల్లో సురక్షితమైన రవాణా సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి, అదనపు ఆదాయం కల్పించడమే ఆజీవిక గ్రామీణ ఎక్స్ప్రెస్ యోజన ప్రధాన లక్ష్యమని వివరించారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి కుటుంబ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. మక్తా భూపతిపూర్ గ్రామంలో రవాణా సౌకర్యాల కొరత ఉందనే విషయం తన దృష్టికి రావడంతో వెంటనే ఎలక్ట్రిక్ ఆటోను మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా అదనపు కలెక్టర్ నగేష్ ఆటో డ్రైవర్గా వ్యవహరించగా, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆటోలో ప్రయాణించారు. ఈ దృశ్యం అక్కడి వారిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ రావు, అదనపు గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి సరస్వతి, డీపీఎం యాదయ్య, ఏపీఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.





## అమరవీరుల త్యాగస్ఫూర్తితో తెలంగాణ ముందుకు సాగాలి: డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి



**చట్టం వికారాబాద్ ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్నెపల్లి మా శారద హాస్పిటల్ ఆవరణలో భారతీయ జనతా పార్టీ మెడికల్ సెల్ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగస్ఫూర్తిని స్మరించుకుంటూ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజలందరికీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెద్దింటి నవీన్ కుమార్, డాక్టర్ స్వప్న, సీనియర్ నాయకులు సుధాకర్ ఆచారి, మోహన్ రెడ్డి, రాఘవేందర్, ప్రవీణ్ రెడ్డి, మల్రెడ్డి, హన్మంత్ రెడ్డి, జంగయ్య, మా శారద హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నా తెలంగాణ కోటి రతనాల వీణ

- **తెలంగాణ చిత్రాన్ని టీ పొడితో అద్భుతంగా చిత్రించి**
- **శుభాకాంక్షలు తెలిపిన రామకోటి రామరాజు**
- **త్యాగాల పునాధుల పై ఏర్పడ్డ రాష్ట్రం తెలంగాణ**





**చట్టం సిద్దిపేట (దుబ్బాక) :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా తెలంగాణ చిత్రాన్ని టీపోడిని ఉపయోగించి సిద్దిపేట జిల్లా గజ్వేల్ కు భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత, శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు అద్భుతంగా చిత్రాన్ని చిత్రించి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకోటి రామరాజు మాట్లాడుతూ ఎందరో అమరుల బలిదానం నాలుగు కోట్ల ప్రజల ఉద్యమ ఫలితమే ఈ మన తెలంగాణ అని అన్నారు. ఆరు దశాబ్దాల కలను నిజం చేసిన ఉద్యమకారులకు, తెలంగాణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు త్యాగాలు మర్చిపోలేనివి అన్నారు. మన భాష, మన యాస గర్వంగా తలెత్తుకున్న ఈ శుభదినాన, రాష్ట్ర ప్రజలందరికీ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**చట్టం, నసురుల్లాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, సహకార సంఘాల ఆవరణల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సువర్ణ, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రవీశ్వర్ గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమరవీరులను స్మరించుకుని రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్ఐ వెంకట స్వామి, ఎంపీవో సూర్యకాంత్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## వికారాబాద్ ఆర్టీవోగా సుభాష్ చంద్ర రెడ్డి బాధ్యతల స్వీకరణ



**చట్టం, వికారాబాద్ ప్రతినిధి :** జిల్లా రవాణా శాఖ అధికారి (ఆర్టీవో)గా సుభాష్ చంద్ర రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇబ్రహీంపట్నం రవాణా శాఖ కార్యాలయంలో విధులు నిర్వహించిన ఆయన బదిలీపై వికారాబాద్‌కు వచ్చారు. వికారాబాద్ ఆర్టీవోగా పనిచేసిన పి. వెంకటరెడ్డి ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ కాగా, ఆయన స్థానంలో సుభాష్ చంద్ర రెడ్డి నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కార్యాలయ సిబ్బందితో సమావేశమై శాఖ పనితీరు, ప్రజలకు అందించే సేవలపై సమీక్ష నిర్వహించారు. రవాణా శాఖ సేవలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా అందించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా సుభాష్ చంద్ర రెడ్డి పేర్కొన్నారు. జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## తెలంగాణ ప్రజలకు అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకుడు చైతన్య కిరణ్

- **కేటీఆర్‌కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపిన చైతన్య కిరణ్**



**చట్టం, వికారాబాద్ ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలందరికీ బీఆర్ఎస్ నాయకుడు చైతన్య కిరణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనేక ఉద్యమాలు, పోరాటాలు, అమరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా చేయడంలో కేటీఆర్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. యువతకు ప్రోత్సాహం అందించడం, నూతన ఆలోచనలకు ప్రాధాన్యత ఇవ్వడం, పెట్టుబడులను ఆకర్షించడం వంటి అంశాల్లో కేటీఆర్ చేసిన కృషి ప్రశంసనీయమని అన్నారు. తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణ కోసం నిరంతరం పనిచేస్తున్న నాయకత్వంగా ఆయన నిలిచారని కొనియాడారు. భవిష్యత్తులో తెలంగాణ మరింత అభివృద్ధి సాధించి అన్ని రంగాల్లో ముందంజలో నిలవాలని ఆకాంక్షిస్తూ, రాష్ట్ర ప్రజలకు మరోసారి అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే కేటీఆర్ దీర్ఘాయుష్షుతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి ప్రభుత్వ ఫలాలు అందజేయాలి

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు
- వినతిపత్రం అందజేసిన ఉద్యమకారులు



**చట్టం, వికారాబాద్ ప్రతినిధి :** తెలంగాణ ఉద్యమంలో తమ జీవితాలను పణంగా పెట్టి ఉద్యమమే ఉద్యోగంగా పనిచేసిన ఉద్యమకారులందరినీ గుర్తించి, వారికి ప్రభుత్వం ప్రకటించిన ఫలాలను అందజేయాలని తెలంగాణ ఐక్య కార్యాచరణ కమిటీ (టీజేఏసీ) పశ్చిమ రంగారెడ్డి జిల్లా మాజీ చైర్మన్ కె. శ్రీనివాస్ కోరారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం వికారాబాద్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం, అక్కడికి వచ్చిన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఉద్యమకారులతో కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన వారికి ప్రభుత్వ ఫలాలు అందజేసే ఉద్దేశంతో ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేసి ప్రక్రియ ప్రారంభించినందుకు జిల్లా ఉద్యమకారుల తరఫున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ సభ్యులు ఉద్యమకారులను గుర్తించి నిర్ణీత కాల వ్యవధిలో ప్రభుత్వానికి జాబితాలు అందజేయాలని, ప్రభుత్వం వీలైనంత త్వరగా ఫలాలు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఉద్యమకారులను గుర్తించే క్రమంలో అమరవీరుల కుటుంబాలు, జైలుకు వెళ్లిన వారు, రాష్ట్ర మరియు రైల్వే పోలీసు కేసులు నమోదైన వారు, ఉద్యమంలో గాయపడిన వారు, అలాగే ఉద్యమ బాధ్యులు, మేధావులు, అధ్యాపకులు, న్యాయవాదులు, విద్యార్థులు, కళాకారులు, రచయితలు, జర్నలిస్టులు, ఆర్టీసీ, సింగరేణి కార్మికులు, ఉద్యోగులు తదితరులను పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అలాగే ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 250 గజాల స్థలం, పెన్షన్, గుర్తింపు కార్డు, ఉచిత విద్యా, వైద్య సౌకర్యాలు, ఆర్టీసీ, రైల్వేల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు రాజకీయ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, జేఏసీ నాయకులు సి. రమేష్‌కుమార్, ఎర్రవల్లి జాఫర్, నర్సింలు, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, ఎం. సురేష్, శివప్రసాద్, రవిశంకర్, కృష్ణారెడ్డి, దేవాదాస్, శివకుమార్ రెడ్డి, కృష్ణయ్య, సుభాస్, కిషోర్, తిరుపతి రెడ్డి, బాలరాజు, మారుతి, అబ్దుల్ సమద్ దత్తు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు వరం ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం



**చట్టం, కుంటాల :** నిర్మల్ జిల్లా కుంటాల మండల పరిధిలోని విట్టాపూర్ గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో భాగంగా స్థానిక ముధోల్ నియోజకవర్గం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకునీ కుంటాల మండలంలోని విట్టాపూర్ గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమానికి ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించి, నూతన గృహాల్లోకి ప్రవేశించిన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం పేద ప్రజలకు సొంత ఇంటి కలను సాకారం చేసే దిశగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ (CMRF) కింద మంజూరైన ఆర్థిక సహాయ చెక్కును, కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## గాంధారి మండలంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**చట్టం గాంధారి;** గాంధారి మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలు గాంధారి సర్పంచ్ మమ్మాయి రేణుక సంజీవ్ యాదవ్, ఉప సర్పంచ్ భాస్కర్ గౌడ్, ప్రజా ప్రతినిధులు అధికారులు జాతీయ పథకాన్ని ఆవిష్కరించి తెలంగాణ అమరవీరులకు నివాళి అర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

## చద్మల్ తాండలో భూ వివాదంతో ఘర్షణ.. పరస్పరం దాడులు

- నలుగురికి తీవ్ర గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషయం



**చట్టం గాంధారి;** గాంధారి మండలం చద్మల్ తండాలో భూవివాదం నేపథ్యంలో రెండు కుటుంబాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. మీరు కుటుంబాలు పురస్పరం దాడులు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో దృక్తా పరిస్థితులు నెలకొవడంతో సమాచారం అందుకున్న గాంధారి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘర్షణలో నలుగురికి తీవ్ర గాయాలు అయినట్లు గాంధారి ఎస్సై మహేందర్ తెలిపారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషయంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రికి తరలించినట్లు తెలియజేసిన. మీరు వర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. గతంలో కూడా ఇది రెండు వర్గాల మధ్య వివాదాలు ఉండడంతో తాసిల్దార్ సమక్షంలో బైండోవర్ చేసినట్లు వెల్లడించారు.

## బిఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం వేడుకలు



**చట్టం గాంధారి;** గాంధారి మండల కేంద్రంలో నెహ్రూ చౌరస్తా వద్ద బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఎగరవేసి అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ వేడుకలో గాంధారి మండల బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామ సభలను సమర్థవంతంగా నిర్వహించాలి..

- ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి







**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** జూన్ 3 నుంచి 12 వరకు నిర్వహించనున్న గ్రామసభలపై రాష్ట్ర ముఖ్య కార్యదర్శి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొన్నారు. గ్రామసభల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యలు, ప్రజల సమస్యల స్వీకరణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు పురోగతి తదితర అంశాలపై ముఖ్య కార్యదర్శి అధికారులకు మార్గనిర్దేశం చేశారు. గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో గ్రామసభలను విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు, జిల్లా స్థాయి వ్యవసాయ, నీటిపారుదల, ఇంధన, పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, విపత్తు నిర్వహణ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శక్తి యాప్ వినియోగంతో మహిళల భద్రత మరింత బలోపేతం

- బాలలపై నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ క్రాంతికుమార్



**చట్టం, జీలుగుమిల్లి :** జీలుగుమిల్లి గ్రామంలో మహిళల భద్రత, శక్తి యాప్ వినియోగం, బాలల రక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ క్రాంతికుమార్ పాల్గొని ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళలు మరియు బాలికల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన శక్తి యాప్ అత్యంత ఉపయోగకరమైన సాధనమని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఒక బటన్ నొక్కడం ద్వారా పోలీసులకు సమాచారం చేరి తక్షణ సహాయం అందే విధంగా ఈ యాప్ పనిచేస్తుందని వివరించారు. ప్రతి మహిళ తమ మొబైల్ ఫోన్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించుకోవాలని సూచించారు. బాలలపై లైంగిక వేధింపులు, దాడులు మరియు ఇతర నేరాలను అరికట్టేందుకు అమలులో ఉన్న పోక్సో చట్టం (POCSO Act) గురించి వివరించారు. పిల్లల పట్ల అనుమానాస్పద ప్రవర్తన, వేధింపులు లేదా నేర సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియా దుర్వినియోగం, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వ్యక్తిగత వివరాలను తెలియని వ్యక్తులతో పంచుకోవద్దని సూచించారు. మహిళల భద్రత, బాలల రక్షణ, నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో మహిళలు, యువత, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో శక్తి యాప్ వినియోగం, మహిళల భద్రత, బాలల హక్కుల పరిరక్షణపై పలు సూచనలు అందజేశారు.

## పర్యావరణ వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలి: సీఎస్ రామకృష్ణారావు




**నిర్మల్, చట్టం ప్రతినిధి :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పర్యావరణ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. అలాగే రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు సన్నద్ధత ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక, పర్యావరణ వారోత్సవాలు, వర్షాకాల సన్నద్ధత, గ్రామసభల నిర్వహణ తదితర అంశాలపై హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ, పర్యావరణ వారోత్సవాలను ప్రణాళికాబద్ధంగా విజయవంతంగా నిర్వహించాలని అన్నారు. ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో గ్రామ, వార్డు సభలను నిర్వహించి ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా రైతులకు వర్షాకాలం, వాతావరణ పరిస్థితులు, పంటల సాగు, ప్రభుత్వ పథకాలపై వివరాలు తెలియజేయాలని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై కూడా ప్రజల్లో అవగాహన పెంపొందించాలని పేర్కొన్నారు. గ్రామసభల్లో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలంలో సంభవించే ఆకస్మిక వరదలు, విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. పోలీసు, పరిపాలనా శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడతామని చెప్పారు. ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో గ్రామ, వార్డు సభలు నిర్వహించి రైతాంగానికి, ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై కూడా విస్తృత ప్రచారం చేపడతామని తెలిపారు. అనంతరం తహసీల్దార్లతో కలెక్టర్ ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామసభలను విజయవంతంగా నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్న భూభారతి, సాదా బైనామా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డీఆర్వో రమేష్, ఎస్‌డీసీఎల్ఏ జల కుమారి, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, సీపీవో గంగారెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- CPI(ML) మాస్ లైన్ డిమాండ్.
- అమరవీరుల స్తూపం వద్ద విప్లవ నివాళి అర్పించిన నాయకులు.



**చట్టం బీబీపేట్ :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) నగర కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయక నగర్ లో గల అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ నగర కార్యదర్శి ఎం. సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లయిన ఉద్యమ ఆకాంక్షలు ఇంకా నెరవేరలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. కానీ ఇప్పటికీ ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేదన్నారు. నగరంలో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు, ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ విద్య, వైద్య రంగాలను బలోపేతం చేయాలన్నారు. అర్హులైన వారందరికీ పెన్షన్లు ఇవ్వాలన్నారు. వరి ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలన్నారు. రైతులకు సరిపడా ఎరువులు అందేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. మత విద్వేషాలను నియంత్రించి, లౌకిక ప్రజాస్వామ్య తెలంగాణను నిర్మించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేనిచో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి కే.సంధ్యారాణి, పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు కే.గణేష్, టీయూసీఐ జిల్లా నాయకులు లింగం, కిరణ్, నాయకులు బీక్ సింగ్, విఠల్, అమూల్య, నితిన్, లక్ష్మీకాంత్, పద్మ, లక్ష్మీ, లలిత, రజియా, ఫాతిమా, దుర్గాప్రసాద్, గంగాధర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## రామాయంపేట మున్సిపాలిటీలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**చట్టం రామాయంపేట :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామాయంపేట మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ వారికి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్వోల యూనియన్‌లో లంచం కలకలం.. ఏసీబీకి చిక్కిన తహసీల్దార్



**చట్టం రామాయంపేట :** మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లాలోని శామీర్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు నిర్వహించిన ఆకస్మిక దాడులు రెవెన్యూ వర్గాల్లో తీవ్ర కలకలం రేపాయి. తహసీల్దార్ సుచరితకు సంబంధించిన లంచం వ్యవహారంలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. భూమికి సంబంధించిన ఒక ఫైలు పరిష్కారం కోసం బాధితుడి నుంచి భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో తహసీల్దార్ తరపున డ్రైవర్ రూ.2 లక్షలు లంచంగా స్వీకరిస్తుండగా, ఏసీబీ అధికారులు పక్కా సమాచారంతో దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారం మొత్తం సుమారు రూ.20 లక్షల లావాదేవీలకు సంబంధించినదిగా ప్రాథమిక విచారణలో వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. డబ్బుల డిమాండ్‌కు కారణమైన భూ వివాదం ఏమిటి, ఈ వ్యవహారంలో మరెవరి ప్రమేయం ఉందా అనే అంశాలపై అధికారులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. దాడుల అనంతరం కార్యాలయంలోని పలు పత్రాలను స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు సంబంధిత వ్యక్తులను విచారిస్తున్నారు. ఈ ఘటన జిల్లాలోని రెవెన్యూ శాఖలో చర్చనీయాంశంగా మారింది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.

## అంగరంగ వైభవంగా అంబరాన్ని అంటిన బారెడు పోచమ్మ బోనాల పండుగ



**చట్టం పెద్ద కొడప్గల్ :** పెద్ద కొడప్గల్ మండలంలోని వడ్లం గ్రామంలో మంగళవారం నాడు ఘనంగా బారెడు పోచమ్మ మరియు ముత్యాల పోచమ్మ పండగ జరుపుకున్నారు. గ్రామ ప్రజలు నిష్ఠ శుద్ధితో అక్క చెల్లెల్లు, అమ్మలు బోనాలు నెత్తిన పెట్టుకొని, భాజా భజంత్రీలతో ఉత్సవంగా గ్రామ ప్రజలు ఊరంతా ఊరేగించి శోభా యాత్రలో పాల్గొని సంబరంగా పండుగను జరుపుకున్నారు. ఆ తల్లి యొక్క దీవెనలు గ్రామ ప్రజలపై ఉండాలని మరియు సమృద్ధిగా వర్షాలు కురవాలని పంటలు పండాలని వ్యవసాయం సుశ్యామలంగా ఉండాలని గ్రామ ప్రజలందరూ ఆ తల్లిని కొలిచారు.

## పుట్ట మైసమ్మ తల్లికి ఘనంగా బోనాలు




**చట్టం, బాసర :** బాసర ప్రసిద్ధ పుణ్యక్షేత్ర సమీపాన రేణుకాపూర్ హనుమాన్ ఆలయం వద్ద గల పుట్టి మైసమ్మ తల్లికి పుట్టీ కుటుంబాలు మంగళవారం ప్రత్యేకంగా బోనాలు సమర్పించి, తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లాకు చెందిన శ్రావణి, నవీన్ గౌడ్, దంపతులు రేణుకపూర్ హనుమాన్ ఆలయ పునర్నిర్మాణ భాగంలో వారి వంతుగా 243 గజాల భూమిని విరాళంగా ఇచ్చి ఒక హనుమాన్ ఆలయ భక్తులుగా గ్రామంలోని అందరికీ ఆదర్శంగా నిలవడం అభినందనీయమని గ్రామస్తులు కొనియాడారు. అనంతరం దంపతులను పుట్టి కులస్తులు ఘనంగా బాసర గ్రామస్తులు విడిసి సభ్యులు ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తీగల వెంకటేష్ గౌడ్, మాజీ సర్పంచ్ పోతుగంటి సతీష్ రావు, ఉపసర్పంచ్ సయ్యద్ అలీ, విడిసి అధ్యక్షుడు నూకం లింగారావు, వార్డు సభ్యులు పుట్టి లక్ష్మీ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్జీయూకేటీ బాసరలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**చట్టం, బాసర :** రాజీవ్ గాంధీ సాంకేతిక విశ్వవిద్యాలయం బాసర క్యాంపస్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ఛాన్స్లర్ ప్రొఫెసర్ ఏ గోవర్ధన్, ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వివిధ విభాగాధిపతులు, అసోసియేట్ డీన్లు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థుల సమక్షంలో తెలంగాణ అమరవీరులను స్మరిస్తూ వారికి ఘన నివాళులర్పించారు. అనంతరం వైస్ ఛాన్స్లర్ ప్రొఫెసర్ ఏ గోవర్ధన్ విద్యార్థులను, సిబ్బందిని ఉద్దేశించి కీలక ఉపన్యాసం చేశారు. అమరవీరుల త్యాగాల ఫలంగా సిద్ధించిన తెలంగాణ రాష్ట్రం భవిష్యత్తులో మరింత బంగారు మయం కావాలని ఆకాంక్షించారు. ఈ ట్రిబుల్ ఐటీలో చదువుతున్న విద్యార్థులు పట్టుదలతో చదివి, భవిష్యత్తులో అత్యున్నత స్థానాల్లో రాణించి సమాజానికి దిక్సూచిగా నిలవాలని పిలుపునిచ్చారు. అదే విధంగా, ఇక్కడి ఉద్యోగులందరి సహాయ సహకారాలతో, ఉమ్మడి కృషితో రాబోయే రోజుల్లో ఆర్జీయూకేటీ బాసర విశ్వవిద్యాలయం దేశంలోనే ఒక గొప్ప ఉన్నత స్థితికి చేరుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాల్లో అసోసియేట్ డీన్లు డా.జి.నాగరాజు, డా. మహేశ్, శేఖర్ శీలం, డా. ఎస్ విట్టల్ తోపాటు వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని యం. రామకృష్ణ, డాక్టర్ బి విజయ్ కుమార్, శ్యాంబాబు, రవి కిరణ్, వసంత, నగేష్ సమర్థవంతంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



**చట్టం. పెద్దకొడప్ గల్ :** మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రోజున జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు 36కళ్యాణ లక్ష్మి 2షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల వివాహాల సమయంలో కుటుంబాలపై పడే ఆర్థిక భారం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకాల లబ్ధి అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం ఎంతో తోడ్పడుతుందని, సమాజంలో ఆడపిల్లల పట్ల గౌరవం పెరగడంలో కూడా ఈ పథకాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో పారదర్శకత పాటిస్తూ నిజమైన లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రాజశేఖర్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శామప్ప, మహేందర్ రెడ్డి, బసవరాజ్ దేశాయ్, లబ్ధిదారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

# ఆరోగ్యమే మహాభాగ్యం... సైకిల్‌నే జీవిత భాగ్యంగా మార్చుకున్న నిజామాబాద్ ప్రముఖులు

## ప్రపంచ సైకిల్ దినోత్సవం ప్రత్యేకం

**చట్టం ప్రతినిధి-నిజామాబాద్**



మారుతున్న జీవనశైలి, పెరుగుతున్న ఆరోగ్య సమస్యల నేపథ్యంలో ఆరోగ్యమే అసలైన సంపద అని నిరూపిస్తూ నిజామాబాద్‌కు చెందిన కొందరు ప్రముఖులు సైక్లింగ్‌ను తమ జీవన విధానంలో భాగం చేసుకున్నారు. వైద్యులు, వ్యాపారవేత్తలు, ఉద్యోగులు, సామాజిక సేవకులు కలిసి ఏర్పడిన 15 మంది సభ్యుల ఈ సైక్లింగ్ బృందం నేడు ఆరోగ్య చైతన్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఈ బృందంలో మంచాల జ్ఞానేందర్, డాక్టర్ ప్రతాప్, డాక్టర్ వెంకటరమణ, శ్రీహరి, వినోద్, వీరేష్, ప్రసాద్, అశోక్, రాజు, పెద్దిరాజు, సురేందర్, తిరుమల నాయుడు తదితరులు సభ్యులుగా ఉన్నారు. తమ తమ వృత్తుల్లో బిజీగా ఉన్నప్పటికీ ఆరోగ్యాన్ని విస్మరించకుండా ప్రతిరోజూ సైక్లింగ్‌కు సమయం కేటాయించడం విశేషం.

**ప్రతిరోజూ 20 నుంచి 30 కిలోమీటర్ల ప్రయాణం**

ఈ సైక్లింగ్ బృందం సభ్యులు ప్రతిరోజూ ఉదయం 20 నుంచి 30 కిలోమీటర్ల మేర సైకిల్ తొక్కుతూ శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకుంటున్నారు. నిజామాబాద్ నగరం నుంచి మామిడిపల్లి, డిచ్‌పల్లి, ఇందల్వాయి, నర్సింగ్‌పల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం తదితర ప్రాంతాలకు క్రమం తప్పకుండా సైక్లింగ్ చేస్తున్నారు. సైక్లింగ్‌ను కేవలం వ్యాయామంగా కాకుండా జీవితశైలిగా మార్చుకున్న ఈ బృందం జిల్లాలోని అనేక మందికి స్ఫూర్తిగా నిలుస్తోంది. ఉదయం వేళల్లో వీరు సమిష్టిగా సైకిల్ యాత్రలు నిర్వహిస్తూ ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు.

**వందల కిలోమీటర్ల సాహసయాత్రలు**

స్థానిక మార్గాలకే పరిమితం కాకుండా ఈ బృందం సభ్యులు ఇప్పటివరకు బాసర, ధర్మపురి, వేములవాడ, భద్రాచలం వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలకు సైకిల్ యాత్రలు నిర్వహించారు. వందలాది కిలోమీటర్ల దూరాలను అధిగమిస్తూ శారీరక సామర్థ్యాన్ని చాటుకున్నారు. ముఖ్యంగా భద్రాచలం యాత్ర ఈ బృందం చేపట్టిన అతిపెద్ద సైక్లింగ్ టూర్‌గా నిలిచింది. ఈ యాత్రల ద్వారా ఆరోగ్యంతో పాటు ఆధ్యాత్మికత, స్నేహబంధం, ప్రకృతి అందాలను ఆస్వాదించే అవకాశం లభించిందని సభ్యులు చెబుతున్నారు.

**తిరుపతి వైపు శ్రీహరి సాహసయాత్ర**

ఈ బృందంలోని సభ్యుడు శ్రీహరి ప్రస్తుతం సైకిల్‌పైనే తిరుమల తిరుపతి యాత్రను కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 800 కిలోమీటర్లకు పైగా సైక్లింగ్ అనుభవం కలిగిన ఆయన, క్రమశిక్షణతో ప్రతిరోజూ సాధన చేస్తూ ఈ సాహస యాత్రకు శ్రీకారం చుట్టారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే సంకల్పంతో ప్రారంభమైన సైక్లింగ్ ప్రయాణం నేడు ఆధ్యాత్మిక యాత్రగా మారిందని ఆయన చెబుతున్నారు. శ్రీహరి చేపట్టిన ఈ యాత్ర సైక్లింగ్ ప్రేమికులకు మరింత ఉత్సాహాన్ని కలిగిస్తోంది.

**సైక్లింగ్ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు**

వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం సైక్లింగ్ అత్యుత్తమ వ్యాయామాల్లో ఒకటి. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. శరీరంలోని అదనపు కొవ్వును తగ్గించి బరువును నియంత్రణలో ఉంచుతుంది. మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సైక్లింగ్ కీలక పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా మానసిక ఒత్తిడిని తగ్గించి ఉల్లాసాన్ని పెంచుతుంది. కీళ్లపై అధిక ఒత్తిడి లేకుండా శరీరమంతా పనిచేసే వ్యాయామం కావడం వల్ల అన్ని వయసుల వారికి అనుకూలంగా ఉంటుంది. పర్యావరణ పరిరక్షణకు కూడా సైకిల్ వినియోగం ఎంతగానో దోహదపడుతుంది.

**యువతకు ఆదర్శంగా..**

స్మార్ట్‌ఫోన్‌లు, డిజిటల్ ప్రపంచం, వాహనాలపై అధిక ఆధారపడుతున్న నేటి తరానికి ఈ సైక్లింగ్ బృందం ఆదర్శంగా నిలుస్తోంది. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే రోజువారీ జీవితంలో వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వాలని, కనీసం కొంత సమయమైనా సైక్లింగ్‌కు కేటాయించాలని సభ్యులు సూచిస్తున్నారు. సమిష్టిగా సైక్లింగ్ చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు స్నేహబంధాలు మరింత బలపడతాయని, జీవితంలో సానుకూల దృక్పథం పెరుగుతుందని వారు చెబుతున్నారు.

**ఆరోగ్యకర సమాజం కోసం సైకిల్ సంస్కృతి అవసరం**

ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా నిజామాబాద్‌కు చెందిన ఈ సైక్లింగ్ వీరులు అందరికీ ఒక స్పష్టమైన సందేశం ఇస్తున్నారు. ఆరోగ్యవంతమైన వ్యక్తులు ఉంటేనే ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని, అందుకోసం సైకిల్ సంస్కృతి మరింత విస్తరించాలని వారు కోరుతున్నారు. ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పర్యావరణ పరిరక్షణ—ఈ నాలుగు లక్ష్యాలను ఒకేసారి సాధించే అద్భుత సాధనం సైకిల్ అని ఈ బృందం నిరూపిస్తోంది.

## ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**చట్టం ముస్తాబాద్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని పోలీస్ స్టేషన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ జ్యోతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరుల సేవలను స్మరించుకోవాలని, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు సేవలందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కేకే మహేందర్ రెడ్డి



**చట్టం ముస్తాబాద్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేకే మహేందర్ రెడ్డి పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులను స్మరించుకున్నారు. వారి త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సహకరించిన సోనియా గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పరకాల పట్టణాన్ని ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దుతా

- కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుంది
- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**చట్టం / పరకాల ;** పరకాల పట్టణ కేంద్రంలోని రాజుపేట లో నూతనంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.విద్యారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని,ఈ పాఠశాల ద్వారా స్థానిక విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో కూడిన విద్య అందుబాటులోకి వస్తుందని తెలిపారు.నిర్మాణ పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా,సమయానికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు మేమే చేస్తాం అని అన్నారు.

## అగ్నివీర్, భారత సైన్యంలో అన్నదమ్ముల ఎంపిక



**చట్టం బాసర :** దేశసేవ లక్ష్యంగా ముందుకు సాగిన ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు భారత సైన్యంలో ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలిచారు. నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రానికి చెందిన సురేఖ-నారాయణరావు దంపతుల కుమారులు విఘ్నేష్‌రావు, రంజిత్‌రావు సైన్యంలో ఎంపికయ్యారు. విఘ్నేష్‌రావు అగ్నివీర్‌గా ఎంపిక కాగా, రంజిత్‌రావు భారత సైన్యంలో ఉద్యోగం సాధించాడు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు కుమారులు దేశ రక్షణ బాధ్యతలు చేపట్టడం పట్ల కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఇద్దరు అన్నదమ్ములు కష్టపడి ఉన్నత లక్ష్యాన్ని సాధించడం యువతకు స్ఫూర్తిదాయకమని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల యువకులు పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి ఉద్యోగాలు సాధించడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఇద్దరు అన్నదమ్ములను అభినందిస్తూ వారి భవిష్యత్ సేవలకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

- జాతీయ జెండాను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్



చట్టం, నిర్మల్ ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసు అధికారులు, సిబ్బంది నుండి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ,రాష్ట్ర ఆవిర్భావం కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులను స్మరించుకుంటూ వారి సేవలను కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు.అంతకు ముందు జిల్లా పోలీసు కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఉపేందర్ రెడ్డి, జిల్లా పోలీస్ ఏ.ఆర్ హెడ్ క్వార్టర్స్ లో ఆర్.ఐ రామ్ నిరంజన్ రావ్ (అడ్మిన్) జాతీయ పథకాన్ని ఎగుర వేశారు. ఈ వేడుకల్లో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ తో పాటు, అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి, నిర్మల్ డి ఎస్పీ శ్రీనివాస్, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ ఐపీఎస్, ఇన్స్పెక్టర్లు, ఆర్ ఐ లు, ఎస్సైలు, ఆర్.ఎస్.ఐ లు, పోలీసు సిబ్బంది, డి.పి.ఓ సిబ్బంది,హోంగార్డులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అమరవీరుల త్యాగాలు చిర స్మరణీయం



- ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమైన పాలకులు
- సామాజిక తెలంగాణ సాధనకై పోరాటాలే శరణ్యం
- బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు

చట్టం భూపాలపల్లి ప్రతినిధి : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన సుదీర్ఘ సమరంలో అమరులైన వీరుల త్యాగాలు చిరస్మరణీయమని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా వరంగల్ కొత్తవాడ లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగిస్తూ అశేష త్యాగాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో గత పన్నెండున్నర సంవత్సరాలుగా పాలకులు ఘోరంగా విఫలమైనారన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా తెలంగాణకు ఇచ్చిన హామీలను అమలు పరచకుండా కేంద్ర ప్రభుత్వం దగా చేస్తున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు బడుగు బలహీన వర్గాలకు యువతకు మహిళలకు ఇచ్చిన హామీలను అమలు పరచకుండా మోసం చేస్తున్నదన్నారు. బీసీలకు విద్యా ఉద్యోగ రంగాలలో మరియు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్న హామీ బుట్టదాఖ లైందన్నారు. చేనేత గీత మత్స్య గొల్ల కురుమ రజక కమ్మరి కుమ్మరి తదితర చేతి వృత్తుల వారి సమస్యలు ఏ ఒక్కటి పరిష్కారంకాలేదన్నారు. రైతు కూలీల సమస్యలు తీవ్రమవుతున్నాయన్నారు. సామాజిక పెన్షన్లు, వికలాంగుల ,వితంతువుల పెన్షన్స్ పెంచే ఆలోచనే ఉన్నట్టు కనిపించడం లేదన్నారు. ఉద్యోగాలు ఉపాధి లభించకుండ నిరుద్యోగులు, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించనందున, మరియు ప్రైవేటు విద్యాసంస్థలలో ఫీజులు నియంత్రించనందున విద్యార్థులు వారి తల్లిదండ్రులు పడుతున్న బాధలు వర్ణణాతీతమన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ ఇందుకోసమేనా అని ప్రశ్నించారు. స్వరాష్ట్రంలో సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తే నిరాశే మిగిలిందన్నారు. ఇప్పటికైనా పాలకులు కళ్ళు తెరిచి ప్రజలకు చేసిన వాగ్దానాలను అమలుపరచాలని డిమాండ్ చేశారు. లేనిచో ప్రజల ఆగ్రహాన్ని చవి చూడవలసి వస్తుందని హెచ్చరించారు. 90శాతంగా ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ బడుగు బలహీన వర్గాల ప్రజలందరు చైతన్యంతో సంఘటితమై అమరవీరులు అందించిన పోరాట స్ఫూర్తితో సామాజిక తెలంగాణ సాధన కోసం బీర్బల్ పోరాడాలని వెంకట్రాములు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎండి అక్బర్, సామల రమేష్, లింగబత్తిని శంకర్, సుమన్, బాసబత్తిని శంకరయ్య, దూడం పెద్దులు, నారాయణ, రమాదేవి, పుణ్యవతి, సంధ్య, వాణి, కళా, అనూష తదితరులు పాల్గొన్నారు.

## అమరుల త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్రం: జిల్లా ఎస్పీ



**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీస్ అధికారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎస్పీ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు. అమరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు సేవలందిస్తుందని తెలిపారు. తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్ శాఖలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి ఎస్పీ చేతుల మీదుగా కఠిన సేవ పథకాలు అందజేశారు. అనంతరం పోలీస్ సిబ్బందికి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, డీపీఓ సిబ్బంది, ఆర్ఐలు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అమరుల త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్రం

- తూప్రాన్ ఆర్డీవో జయచంద్రా రెడ్డి



**చట్టం, తూప్రాన్;** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు తూప్రాన్ లోని ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ వద్ద అధికారులు ఘనంగా నిర్వహించారు. తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి జాతీయ జెండాను ఎగురవేసి పతాక వందనం చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అమరుల త్యాగాల ఫలితమే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష నెరవేరడానికి ఎన్నో ఏళ్ల పాటు జరిగిన పోరాటం, అమరుల త్యాగాలు ఎప్పటికీ మరువరానివని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమాన్ని, ఆ ఉద్యమంలో విద్యార్థులు, యువత, ప్రజలు చేసిన త్యాగాలను గుర్తు చేస్తూ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం వివిధ రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ముందుకు సాగుతోందని, రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమీకృత కార్యాలయాల సముదాయంలో ని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## దాతర్ పల్లి లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**చట్టం, తూప్రాన్;** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని తూప్రాన్ మండలంలోని దాతర్‌పల్లి గ్రామంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ జయరాములు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ జయరాములు మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాల ఉద్యమాలు, త్యాగాలు, ప్రజల ఆకాంక్షల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రత్యేకత, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వేడుకల్లో భాగంగా తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేసి, రాష్ట్ర ప్రగతి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## నవీపేట్ బిజెపి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**చట్టం నవీపేట్ :** నవీపేట్ మండల బిజెపి శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద బిజెపి మండల అధ్యక్షులు ద్యాగాసరిన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భరత్ రెడ్డి భరతమాత చిత్రపటానికి, తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ద్యాగాసరీన్ మాట్లాడుతూ అమరుల త్యాగాలు, ప్రజల దశాబ్దాల పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సాధించిందని అన్నారు. తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల ఆశాలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని వారి కలలను నిజం చేసేందుకు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నవీపేట్ మండల ప్రజలందరికీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భరత్ రెడ్డి, జిల్లా నాయకులు పిల్లి శ్రీకాంత్, మైస రాధా, వార్డు సభ్యులు బునాది మంజుల, నవీన్, ప్రేమ్, నాయకులు గణేష్, ఆనంద్, రాము, పునాది ప్రవీణ్ మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు



**చట్టం ముస్తాబాద్:** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ, తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం, తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు వేసి జాతీయ జెండాతో పాటు బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాట్లాడిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భోంపెల్లి సురేందర్ రావు, అమరవీరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జనగామ శరత్ రావు, పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా నాయకురాళ్లు, బీఆర్ఎస్ కార్యకర్తలు, పార్టీ కుటుంబ సభ్యులు మరియు పలువురు ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీ దుబ్బ రాజరాజేశ్వర ఆలయానికి విరాళం



**చట్టం న్యూస్, వేములవాడ రూరల్ :** వేములవాడ రూరల్ మండలం నాగయ్యపెల్లి గ్రామంలో వెలిసిన శ్రీ దుబ్బ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి శెట్టిపల్లి నిఖిల్ తండ్రి మల్లారెడ్డి అనువారు 5000 రూపాయల విరాళం మంగళవారం అందజేశారు. ఇదే గ్రామానికి చెందిన శెట్టిపల్లి సునీత మల్లారెడ్డి దంపతులు తమ కుమారుడి పుట్టినరోజు పురస్కరించుకొని ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు తమ వంతుగా ఇట్టి విరాళం అందజేసినట్లు వారు పేర్కొన్నారు. ఇట్టి విరాళం అందజేసిన శెట్టి పెల్లి సునీత మల్లారెడ్డి దంపతులకు ఆలయ అభివృద్ధి కమిటీ తరపున ధన్యవాదాలు తెలియజేశారు.

## కందకుర్తి పుష్కర ఘాట్లను పరిశీలించిన బోధన్ ఆర్డీవో



**చట్టం రెంజల్ :** రెంజల్ మండలం కందకుర్తి త్రివేణి సంగమం పుష్కర ఘాట్లను బోధన్ ఆర్డీవో విజయ కుమారి మంగళవారం సందర్శించి పరిశీలించారు. సందర్భంగా బోధన్ ఆర్డీవో విజయ కుమారి మాట్లాడుతూ రాబోయే సంవత్సరానికి నిర్వహించే పుష్కర పుణ్య స్నానాలను దృష్టిలో పెట్టుకొని పుష్కర స్నానాలు ఆచరించడానికి విచ్చేస్తున్న భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా త్వరితగతిన పనులను చేపట్టి రహదారులు, వీధి దీపాలు, మరుగుదొడ్లు గదులు, స్నానపు గదులు, మంచినీటి సౌకర్యం, పార్కింగ్ స్థలం, కల్పించి పుష్కర ఘాట్ల సమీపంలో గజ ఈతగాలను అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు శ్రావణ్ కుమార్, స్థానిక గ్రామ సర్పంచ్ గియాజుద్దీన్, ఉప సర్పంచ్ నాగేష్, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## గడ్డం కేశవమూర్తికి ఘన సన్మానం



**చట్టం/ పరకాల ;** వరంగల్ వాయిస్ దినపత్రిక ఎడిటర్, టీయూడబ్ల్యూజే హనుమకొండ జిల్లా అధ్యక్షులు గడ్డం కేశవమూర్తిని పద్మశాలి టీచర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన జర్నలిస్ట్ యూనియన్ ఎన్నికల్లో హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా ఆయన అఖండ విజయం సాధించినందుకు గాను ఈ అభినందన సత్కారాన్ని ఏర్పాటు చేశారు. సొసైటీ గౌరవ అధ్యక్షులు ధర్మపురి రాజ గోవింద్, అధ్యక్షులు చెలమల్ల నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో గడ్డం కేశవమూర్తిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చం అందజేసి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సొసైటీ బాధ్యులు రాజ గోవింద్, నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కేశవమూర్తి జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్నారని, భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఒక ప్రముఖ పత్రికా ఎడిటర్ గా, యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా పద్మశాలి కుల బాంధవులకు, సమాజానికి తన వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. తన విజయాన్ని అభినందిస్తూ ఇంతటి ఘన సత్కారాన్ని ఏర్పాటు చేసిన పద్మశాలి టీచర్స్ వెల్ఫేర్ సొసైటీ బాధ్యులందరికీ, సంఘ సభ్యులకు గడ్డం కేశవమూర్తి పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో పద్మశాలి టీచర్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కందగడ్ల సురేష్, వైస్ ప్రెసిడెంట్ తుమ్మ రమేష్ బాబు, గౌరవ సలహాదారు బూర భిక్షపతి, తౌటం భాస్కర్, దానం నాగేందర్, అలాగే వరంగల్ జిల్లా బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ కొంగ వీరస్వామి పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**చట్టం/ పరకాల ;** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభ సందర్భంగా పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మరియు అమర దామం యందు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతం,తెలంగాణ గీతాన్ని ఆలపించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, రాష్ట్ర అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని అన్నారు.రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

## ఘనంగా హవేలిఘన్ పూర్ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**చట్టం మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈరోజు హవేలీ ఘనపూర్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు వదలపర్తి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ, "తెలంగాణ రాష్ట్ర సాధనలో దివంగత నేత సుష్మా స్వరాజ్ పాత్ర చిరస్మరణీయమైనది. పార్లమెంట్ వేదికగా ఆమె గొంతు ఎత్తి పోరాడడం వల్లే నేడు తెలంగాణ సాధ్యమైంది. అటువంటి మహానీయురాలిని స్మరించుకోవడం మనందరి బాధ్యత," అని పేర్కొంటూ ప్రజలందరికీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండల నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "ప్రస్తుత ప్రభుత్వం ప్రజా సమస్యలను, రైతుల ఇబ్బందులను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డి సర్కార్ వైఖరిని ఖండిస్తున్నాము. వెంటనే వడ్ల కొనుగోలు కేంద్రాల్లో లారీలను పంపి, ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తున్నాము," అని స్పష్టం చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించని పక్షంలో, బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీపాల్, వెంకట్ , మండల కార్యదర్శి సురేందర్ గౌడ్, మండల ఓబిసి మోర్చా అధ్యక్షులు సత్యం, మండల మహిళా మోర్చా అధ్యక్షులు విజయ, బీజేవైఎం నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి మండల సోషల్ మీడియా కన్వీ నర్ నవీన్, ఇతర బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొలంగూర్ ప్రభుత్వ పాఠశాలలో చేరే విద్యార్థులకు ప్రత్యేక బహుమతి



**చట్టం, శంకరపట్నం :** మండల పరిధిలోని మొలంగూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల నమోదును పెంచేందుకు గ్రామ ప్రజాప్రతినిధులు, దాతలు, విద్యాభిమానులు సమిష్టిగా కృషి చేస్తున్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బడి బాట ప్రచార కార్యక్రమాలపై వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కంకణాల నీరజ మాట్లాడుతూ, పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు గ్రామ సర్పంచ్ పూదరి రాజు, ఉప సర్పంచ్ దండు రాజేష్ సంయుక్తంగా వినూత్న నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలను వదిలి ఈ విద్యా సంవత్సరంలో మొలంగూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేరే ప్రతి విద్యార్థికి ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆకర్షణీయమైన బహుమతిని అందజేయనున్నట్లు ప్రకటించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల విశిష్టతను చాటిచెప్పేలా సర్పంచ్ రూపొందించిన ప్రచార వీడియో పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ప్రతిభను ప్రతిబింబిస్తోందని ఆమె తెలిపారు. బడి బాట ప్రచారం కోసం సర్పంచ్, ఉప సర్పంచ్ చెరో రూ.1,000 చొప్పున ఆర్థిక సహాయం అందించి కరపత్రాల ముద్రణకు సహకరించినట్లు వివరించారు. తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల కోసం అధిక ఖర్చులు చేసి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనవద్దని, ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. మొలంగూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గత అనేక సంవత్సరాలుగా పదో తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత నమోదు చేస్తోందని గుర్తు చేశారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాసిన 13 మంది విద్యార్థుల్లో 12 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై మండల స్థాయిలో విశిష్ట ఫలితాలు సాధించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంపొందించేందుకు గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు అందరూ కలిసి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

## గొర్రెలకు వేసే మందు తాగి యువకుడి ఆత్మహత్యాయత్నం

- 108 సిబ్బంది సకాలంలో స్పందన..
- హుజూరాబాద్ ఆస్పత్రికి తరలింపు



**చట్టం శంకరపట్నం :** గొర్రెలకు ఉపయోగించే మందు తాగి ఒక యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం శంకరపట్నం మండలం ఆముదాలపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ఆముదాలపల్లి గ్రామానికి చెందిన దొంగల సతీష్ (30) అనే యువకుడు మంగళవారం స్థానిక గ్రామపంచాయతీ ఆవరణలో గొర్రెలకు ఉపయోగించే మందు తాగాడు. గమనించిన గ్రామస్తులు వెంటనే స్పందించి 108 అత్యవసర సేవలకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే 108 సిబ్బంది ఈఎంటి గూడూరు సతీష్ రెడ్డి, పైలట్ గోపికృష్ణలు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న సతీష్‌ను అంబులెన్స్‌లోకి ఎక్కించి, మార్గమధ్యంలోనే ప్రాథమిక చికిత్స అందిస్తూ హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమయానికి 108 వాహనం రావడంతో యువకుడికి ప్రాణాపాయం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. అయితే, యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## ఆర్మూర్ ఆర్టీవోగా పూర్తి బాధ్యతలు స్వీకరణ



**చట్టం ఆర్మూర్:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆర్మూర్ ఇంచార్జి ఆర్టీవోగా విధులు నిర్వహించిన మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రాహుల్ కుమార్. ఆర్మూర్ ఆర్టీవోగా పూర్తి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా, మంగళవారం రోజు ఈ ప్రత్యేక సందర్భంలో ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు సుంకే శ్రీనివాస్, ఆర్టీవో రాహుల్, ని కలిసి వారికి పూలగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించి తమ శుభ అభినందనలు తెలియజేశారు.

# స్వరాష్ట్రంలో అమరవీరుల కుటుంబాలకు తీవ్ర అన్యాయం

- క్రొవత్తులతో అమరవీరులకను స్మరించి... ఘన నివాళులు అర్పించి...
- సాధించుకున్న స్వరాష్ట్రంలో ఉద్యోగ అవకాశాలు లేక అనేకమంది ఆత్మబలిదానాలు
- రాష్ట్ర ప్రభుత్వం వీలైనంత తొందరగా నోటిఫికేషన్లు జారీ చేయాలి
- రామాలయం యూత్ ఆర్గనైజేషన్ సొసైటీ జనరల్ సెక్రెటరీ దండు సదానందం





**చట్టం రామకృష్ణాపూర్:**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా రామాలయం చౌరస్తా ఏరియాలోని తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద, అమరవీరుల స్థూప నిర్మాణ కర్తలు, రామాలయం యూత్ ఆర్గనైజేషన్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం అమరవీరుల స్థూపానికి పూల మాలలు వేసి, కొవ్వొత్తులు వెలిగించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామాలయం యూత్ ఆర్గనైజేషన్ జనరల్ సెక్రెటరీ దండు సదానందం మాట్లాడుతూ... తెలంగాణ స్వరాష్ట్రం కోసం ఎంతోమంది ఆత్మ బలిదానాలు చేసుకుంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఆనాడు ఉన్న ఉద్యమ సమయంలో రామాలయం ఆధ్వర్యంలో మొట్ట మొదటిగా "జై తెలంగాణ" అనే నినాదంతో రైళ్లకు బస్సులకు, ఆటోలు కార్లకు, బైకులకు స్టిక్కర్లు వేసి తెలంగాణ ఉద్యమం ప్రారంభించి, అమరవీరుల స్థూపం నిర్మాణం చేపట్టేందుకు స్థానిక ప్రజలు, రామాలయం యూత్ సహకారంతో విరాళాల సేకరించారు. నిర్మాణం చేపట్టే క్రమంలో ఆ డబ్బులు సరిపోక వంటలు మార్పులు చేసి మరి తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటు చేసి ప్రొఫెసర్ కోదండరాం, తెలంగాణ గేయ రచయిత దేశపతి శ్రీనివాస్, మాజీ మంత్రి హరీష్ రావు చేతుల మీదుగా రామాలయం ఏరియా స్తూపాన్ని ప్రారంభించడం జరిగిందని, ఈ ప్రాంతంలో అమరవీరుల స్తూపం ఏర్పాటు చేయడంతో అనేక ఉద్యమాలు ఇక్కడి నుంచే ప్రారంభమై ఈ ప్రాంతానికి మంచి గుర్తింపు వచ్చిందని, అంతేకాక ఈ ప్రాంత వేదికగా రామాలయం యూత్ ఆర్గనైజేషన్ సొసైటీ సభ్యుల నుండి ఒకరు క్యాతనపల్లి సర్పంచిగా ఎదిగారని గుర్తు చేశారు. ఆనాటి ఉద్యమం కోసం పాటుపడిన ప్రతి ఒక్క తెలంగాణ ఉద్యమకారులకు ప్రత్యేక ఉద్యమాభివందనాలు తెలిపారు.

**స్వరాష్ట్ర సాధనలో నిరుద్యోగులకు నిరాశ...**

స్వరాష్ట్రం సాధించినప్పటికీ 12 సంవత్సరాల గడుస్తున్న ఇప్పటికి నీళ్లు, నిధులు నియామకాలు లేక నిరుద్యోగులు ఎంతో నిరాశకు గురై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఎంతోమంది విద్యార్థులు, ఉద్యోగులు ప్రాణ త్యాగం చేసుకుంటే తప్ప తెలంగాణ ఏర్పడలేదని, ఏ లక్ష్యంతో నైతే తెలంగాణ సాధించుకున్నామో ఆ కల సహకారం కాలేదని, తెలంగాణలో ఉద్యోగ అవకాశ లేక ఇప్పటికీ అనేకమంది ఆత్మబలిదానం చేసుకుంటున్నారని తమ ఆవేదన వ్యక్తం చేశారు. తెచ్చుకున్న తెలంగాణ ప్రాంతంలో నిరుద్యోగ సమస్య ఇప్పటికి వెంటాడుతుందన్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప నిరుద్యోగుల బతుకులు మాత్రం మారడం లేదన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వం నిరుద్యోగుల కోసం నోటిఫికేషన్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమ సమయంలో పోరాటం చేసిన అమరుల కుటుంబాలకు ఇప్పుడు ఉన్న ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతానికి నియోజకవర్గ ఎమ్మెల్యేగా, కార్మిక శాఖ మంత్రిగా ఉన్న వివేక్ వెంకటస్వామిచెన్నూర్ ప్రాంతంలో పరిశ్రమలను నెలకొల్పి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామాలయం యూత్ సభ్యులు జాడి శ్రీనివాస్, కంది మహేందర్ బాబు, గుజ్జ కిరణ్ కుమార్, జకినబోయిన కుమార్, గుత్తుల మహేష్ దుర్గ, సీపీఐ నాయకులు మిట్టపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అమరవీరుల ఆశయ సాధనే బీఎస్పీ లక్ష్యం: జగన్ మోహన్



**చట్టం నిర్మల్ ప్రతినిధి :** తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి బీఎస్పీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పూలమాలలు సమర్పించి ఘన నివాళులు అర్పించినట్లు బీఎస్పీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు జగన్ మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఎవరి దయాదాక్షిణ్యాల వల్ల ఏర్పడింది కాదని, వేలాది మంది విద్యార్థులు, యువత, ప్రజలు చేసిన త్యాగాలు, పోరాటాలు, బలిదానాల ఫలితంగా సాధించుకున్న ప్రజల రాష్ట్రం అని పేర్కొన్నారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులందరికీ బీఎస్పీ తరఫున నివాళులు అర్పించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో బీఎస్పీ అధినేత మాయావతి నాయకత్వంలో పార్టీకి చెందిన 39 మంది పార్లమెంట్ సభ్యులు తెలంగాణ బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో బీఎస్పీ పోషించిన పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. చిన్న రాష్ట్రాల ద్వారా అభివృద్ధి సాధ్యమవుతుందని, బహుజనులు మరియు బలహీన వర్గాలకు రాజకీయ అధికారం, సామాజిక న్యాయం అందించాలనే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సిద్ధాంతాలకు బీఎస్పీ కట్టుబడి ఉందని తెలిపారు. రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు గడిచినా తెలంగాణ ఉద్యమం ఆకాంక్షించిన సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, బహుజనుల అభివృద్ధి పూర్తిస్థాయిలో సాధ్యం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారాలు మారినా బహుజనుల జీవితాల్లో ఆశించిన స్థాయిలో మార్పు రాలేదని విమర్శించారు. తెలంగాణ కోసం అమరవీరులు కలలు కన్నది కొందరి పాలన కోసం కాదని, బహుజనుల రాజ్యాధికారం కోసం అని పేర్కొన్నారు. అమరవీరుల ఆశయాలను సాకారం చేసే శక్తి బీఎస్పీకి మాత్రమే ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర్, చెరుకు రాజ్యం, లక్ష్మీ యాదవ్, కాటం ప్రభాకర్, జోసెఫ్ గంగారాం, ముత్యం, సాయన్నతో పాటు అసెంబ్లీ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

## నిర్మల్ జిల్లాలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



- సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన వేడుకలు
- భారీ సంఖ్యలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు

**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు దస్తురాబాద్, కడెం, ఖానాపూర్, లక్ష్మణచందా, మామడ, సోన్, సారంగాపూర్, దిలావర్‌పూర్, నర్సాపూర్ (జి), లోకేశ్వరం, కుంటాల, ముధోల్, కుబీర్, తానూర్, బాసర, భైంసా మండలాల పరిధిలో తెలంగాణ రాష్ట్ర 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ మరియు ప్రైవేటు విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పోలీస్ స్టేషన్లు, గ్రంథాలయాలు, పీఏసీఎస్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలు, ఏరియా ఆసుపత్రులు, పశువైద్య కేంద్రాలు, బాసర రైల్వే స్టేషన్, ట్రిపుల్ ఐటీ కళాశాల, జ్ఞాన సరస్వతి ఆలయం, ఆర్టీసీ డిపోలు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయాలను ప్రతిబింబించే పాటలు, నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యాలు, గీతాలాపన కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమాన్ని స్మరించారు. ప్రత్యేక రాష్ట్రం కోసం అనేక మంది విద్యార్థులు, ఉద్యమకారులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఉద్యమ కాలంలో రైల్వే రోకోలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, రహదారి నిర్బంధాలు నిర్వహించి సాధించిన తెలంగాణ రాష్ట్రం నేడు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలైన బతుకమ్మ, బోనాలు వంటి పండుగలు రాష్ట్ర ప్రత్యేకతను చాటుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ యాస, భాష, ఆచార వ్యవహారాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమాల్లో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**చట్టం పోతంగల్ కోటగిరి :** నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పోతంగల్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, గ్రామ పంచాయతీ,ప్రభుత్వ పాఠశాల ఎంపిడిఓ ఆఫీసు వద్ద ఘనంగా వేడుకలను నిర్వహించారు. మండల తాసిల్దార్ సందీప్ జాతీయ జెండాను ఎగురవేయగా, పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయుల నడుమ పతాకావిష్కరణ జరిగింది. రాష్ట్ర పురోభివృద్ధికి కృషి చేసిన అమరవీరుల త్యాగాలు మరువ లేమని ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని, విద్యార్థులు మరియు గ్రామస్తులు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు.

## ఘనంగా కౌన్సిలర్ కొక్కిరాల దీప్తి జన్మదిన వేడుకలు



**చట్టం /పరకాల;** పరకాల మున్సిపాలిటీ 14వ వార్డ్ కౌన్సిలర్ కొక్కిరాల దీప్తి రాకేష్ రావు జన్మదిన వేడుకలను నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్సా దార్లుల్ ఉలూమ్.. ముస్లిం పాఠశాల నందు అనాధ పిల్లతో మదర్సా గురువు నసిమ్ అక్తర్ కలిసి కేక్ కట్ చేపించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పాడి భగవాన్ రెడ్డి, పట్టణ అధికార ప్రతినిధి ఎండి మాక్సూద్ అలీ, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి బియా బాని,వార్డ్ అధ్యక్షులు బండి వెంకటేష్,దగ్గు రాజేశ్వర్ రావు,పడిదల వెంకన్న, సుధాకర్ రావు, బొమ్మ కంటి నాగరాజు, బొల్లెడ్ల కృపాకర్ రెడ్డి, ఎండీ మంజూరు అలీ,ఎండీ ఖలీం, ఎండీ ఇలాహి, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఏర్పాటులో బిజెపి పాత్ర కీలకం

- జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** తెలంగాణ ఉద్యమంలో ఎంతో మంది ఉద్యమకారులు అమరవీరులయ్యారని వారి త్యాగాల ఫలితమే తెలంగాణ ఆవిర్భావమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ కొనియాడారు. మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ బిల్లుకు సంబంధించి పార్లమెంటులో బిజెపి కీలక పాత్ర వహించిందన్నారు. రాజ్ నాథ్ సింగ్ హైదరాబాదుకు వచ్చి తెలంగాణకు సపోర్టు చేశారని, సుష్మా స్వరాజ్ తెలంగాణ బిడ్డలు చనిపోవద్దని అండగా ఉంటామని చెప్పారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలు చనిపోతున్నారు బిల్లు పెట్టండి అని చెప్పింది బిజెపియే అన్నారు. నీళ్లు, నిధులు నియామకాల కోసం యువకులు పోరాటం చేశారని, కానీ తెలంగాణ కాంగ్రెస్ నేతృత్వంలో తిరోగమన దిశలో తెలంగాణ పోతుందని ఆందోళన వ్యక్తపరిచారు. తెలంగాణ తన గొప్పదనం చాటి చెప్పాలంటే బిజెపితోనే సాధ్యమన్నారు. బిజెపి నాయకులు ఉమారెడ్డి, కాసానగొట్టు సంతోష్, గుండ్ల జనార్ధన్, సుతారి కార్తీక్, తాటికొండ శ్రీనివాస్, కెమ్మసారం సంతోష్, సునీల్, కనకరాజు, యాదగిరి, వెంకట్రాంరెడ్డి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సంపల్లి లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**చట్టం, తూప్రాన్;** తూప్రాన్ మండలం నర్సంపల్లి లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ భాస్కర్ నాయక్ జాతీయ జెండాను ఎగురవేశారు. అననంతరం సర్పంచ్ మాట్లాడుతూ అమరుల త్యాగాల ఫలితంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో మాజీ ముఖ్యమంత్రి మన గజ్వెల్ ఎమ్మెల్యే కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రాణాలకు తెగించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటం చేసారని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మరియు ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## డ్రైవింగ్ స్కూల్ ఆత్మీయ సమ్మేళనం




**చట్టం శంషాబాద్ :** రంగారెడ్డి జిల్లా ఎల్ ఎం వి డ్రైవింగ్ స్కూల్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జే ఏ సీ సభ్యులు, రంగారెడ్డి జిల్లా డ్రైవింగ్ స్కూల్ ప్రెసిడెంట్ బాలస్వామి గౌడ్ ఆధ్వర్యంలో శంషాబాద్ పరిధిలోని చౌడమ్మ టెంపుల్ పరిధిలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలస్వామి గౌడ్ మాట్లాడుతూ... ఆర్టీఏ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. ప్రతి డ్రైవింగ్ స్కూల్ కి ఆర్టీఏ నుంచి పర్మిషన్ తీసుకోవాలన్నారు. మైనర్ల కు డ్రైవింగ్ నేర్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు డ్రైవింగ్ సులభంగా బోధన, శిక్షణ పై డ్రైవింగ్ స్కూల్ సభ్యులకు అవగాహన కల్పించి, ధరల పట్టిక ను విడుదల చేశారు. ఈ సమావేశంలో వంద డ్రైవింగ్ స్కూల్ లకు పైగా సభ్యులు హాజరయ్యారు. అనంతరం డ్రైవింగ్ స్కూల్ సభ్యులకు అసోసియేషన్ సభ్యులు శాలువాలతో సన్మానం చేశారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం రోజు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జాతీయ పతకాన్ని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిబాబా గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎందరో ప్రాణల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని అన్నారు. సాధించుకున్న తెలంగాణను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ, కృషిని యావత్తు తెలంగాణ రాష్ట్రం మరిచిపోదు అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో మనమందరం భాగస్వాములై తెలంగాణ ప్రభుత్వానికి అండగా ఉందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మున్సిపల్ చైర్మన్ గోనె లహరి, వైస్ చైర్మన్ కాటిపల్లి వెంకటరెడ్డి, పట్టణ కౌన్సిలర్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గిరి, పూల నరసయ్య, బాల్ రెడ్డి, అజ్జు, మాజిత్, ఖాందేష్ శ్రీనివాస్, కొంత మురళి, మహమూద్ హలీ, ఖాందేష్ సత్యం, పింజ అభినవ్, తోపారం భగత్, బబ్లు తదితరులు పాల్గొన్నారు.

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక
CHATTAM NEWS
నిజామాబాద్
బుధవారం
03.06.2026


# 12వ తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం: వివేక్ వెంకటస్వామి

**చట్టం మెదక్ ప్రతినిధి :** 12వ తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాల సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, తెలంగాణ సాధన కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన అమరులను స్మరించుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆరు దశాబ్దాల పాటు సాగిన ఉద్యమంలో విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు, కవులు, కళాకారులు, కార్మికులు, రైతులు, మహిళలు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. వారి త్యాగాలు, పోరాట స్ఫూర్తి ఫలితంగానే 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. అమరుల ఆశయాలు, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల రంగాల్లో రాష్ట్రం గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. మెదక్ జిల్లాలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను వెల్లడిస్తూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు బీమా, ఆరోగ్యశ్రీ వంటి పథకాల ద్వారా వేలాది కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద జిల్లాలో మొదటి విడతలో 9,098 ఇళ్లను మంజూరు చేయగా, వాటిలో వేల సంఖ్యలో గృహాల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. రైతు భరోసా, రుణమాఫీ, రైతు బీమా పథకాల ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పరిశ్రమల స్థాపనకు టీజీఐపాస్ ద్వారా భారీ పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. పౌర సరఫరాల శాఖ ద్వారా ఉచిత సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల మంజూరు చేపట్టామని వివరించారు. విద్యా రంగంలో జిల్లాలో పదో తరగతి ఫలితాల్లో 96.63 శాతం ఉత్తీర్ణత సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు పోషకాహారంతో కూడిన అల్పాహారం, పాలు, రాగిజావ అందిస్తున్నామని తెలిపారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమం ద్వారా లక్ష్యానికి మించి మొక్కలు నాటినట్లు వెల్లడించారు. మహిళా సంఘాలకు రుణాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు అధికారులు, ఉద్యోగులు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేస్తున్న అధికార యంత్రాంగానికి



అభినందనలు తెలిపారు. చివరగా ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులు, ప్రజలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## యావపూర్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**చట్టం, తూప్రాన్;** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు తూప్రాన్ మండలం యావపూర్ గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ యంజాల స్వామి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ యంజాల స్వామి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల ఉద్యమాలు, త్యాగాలు, ప్రజల ఆకాంక్షల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి సంక్షేమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రత్యేకత, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వేడుకల్లో భాగంగా తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేసి, రాష్ట్ర ప్రగతి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ చాకలి హన్మంతు, నాయకులు బొళ్ళెంపల్లి బాబుల్ రెడ్డి, మాజీ సర్పంచ్ శేరి నర్సింహారెడ్డి, నూతన గ్రామ కార్యదర్శి, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శంకరపట్నంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం



**చట్టం :శంకరపట్నం :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం శంకరపట్నం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండారి తిరుపతి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ సభ్యులు, మాజీ జడ్పీటీసీ శ్రీ బత్తిని శ్రీనివాస్ గౌడ్ విచ్చేసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకులకు, కార్యకర్తలకు ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బత్తిని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... అమరుల త్యాగాలు, సోనియా గాంధీ చారిత్రాత్మక నిర్ణయం వల్లే తెలంగాణ రాష్ట్రం సాకారమైందని కొనియాడారు.ఈ వేడుకల్లో దేవస్థానం చైర్మన్ కోరెం రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, మాజీ మండల అధ్యక్షులు గోపగోని బసవయ్య గౌడ్, దేవస్థానం మాజీ చైర్మన్ ఉప్పుగండ్ల మల్లారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆడెపు అజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి హిసమోద్దీన్, జిల్లా కమిటీ సభ్యులు రాజకొమురయ్య, ప్రముఖ నాయకులు మొలుగురి సదానందం, కల్లేపల్లి రాజయ్య, పడాల తిరుపతి, బొంతల శ్రీనివాస్, తడిచర్ల తిరుపతి, రాజకుమార్, కృష్ణకాంత్, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా భారడి పోచమ్మ తల్లి బోనాల పండుగ



**చట్టం పోతంగల్ /కోటగిరి:** నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని కల్లూరు గ్రామంలో భారడి పోచమ్మ తల్లి బోనాలను ఘనంగా నిర్వహించగా గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా నిర్వహించే ఈ సాంప్రదాయ ఉత్సవాల్లో భాగంగా ఉదయం నుంచే గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. గ్రామానికి చెందిన మహిళలు, యువతులు సాంప్రదాయ దుస్తులు ధరించి, నైవేద్యాలతో కూడిన బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించి, తమ మొక్కులు చెల్లించుకున్నారు. పండుగ పురస్కరించుకుని గ్రామ కమిటీ సభ్యులు ఆలయ పరిసరాలను రంగురంగుల విద్యుత్ దీపాలు, తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు.సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నట్లు గ్రామ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేయగా, కల్లూరుతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలోస్థానిక సర్పంచ్ చెన్నూరి రాంరెడ్డి, ఉప్ప సర్పంచ్ దశరథ్, గ్రామకమిటీ అధ్యక్షులు పాశం బాలకృష్ణ, ఉపాధ్యక్షులు నరేష్, కోశాధికారి గోపాల్, గ్రామ పెద్దలు లింగప్ప, భూత్కూర్ గంగాధర్, కుమ్మరి అంజయ్య, వడ్ల నవీన్, శ్రవణ్, ఆడపడుచులు, యువకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించిన రూరల్ కాంగ్రెస్ నాయకులు



**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రూరల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోయినేని కరుణాకర్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ చౌక్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సోయినేని కరుణాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు అనేక మంది చేసిన త్యాగాలు చిరస్మరణీయమని, వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రజలంతా ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వకుల బరణం శ్రీనివాస్, గోవర్ధన్ రెడ్డి, బండ శ్రీనివాస్, జైపాల్ రెడ్డి, వంగపల్లి మల్లేశం, ఎడపల్లి అనిల్, జగదీష్, అరీనందన్ రెడ్డి, ఎల్లా గౌడ్, రాజు కైలాసం, భూమిరెడ్డి మల్లేశం తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు



**చట్టం శంషాబాద్ :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి డైరెక్టర్ శంషాబాద్ మండల మాజీ జెడ్పిటిసి బుర్కుంట సతీష్ ఆధ్వర్యంలో నర్కుడ చౌదరిగూడ గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించి, అనంతరం ఘనంగా బైక్ ర్యాలీ చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఓయూ విద్యార్థులు, తెలంగాణ ఉద్యమకారులు, అభిమానులు మరియు అమరవీరులను గుర్తు చేసుకొని వారికి ఘన నివాళులు అర్పించారు. తెలంగాణకు గతంలో జరిగిన అన్యాయాలు, మోసాలను గుర్తు చేసుకుంటూ, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మళ్లీ తెలంగాణ ప్రభుత్వం రావాలని, ప్రతి వర్గానికి న్యాయం జరిగే విధంగా పాలన సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చాటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ నాయకులు గూడపు రాజన్న, బుర్కుంట మహేష్, బిఆర్ఎస్ పార్టీ విలేజ్ ప్రెసిడెంట్ మహేష్ యాదవ్, వైస్ ప్రెసిడెంట్ లింగం, శ్రీశైలం, మంకాల వినోద్, బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గాదెపల్లిలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని డొంకేశ్వర్ మండలం గాదెపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం రోజు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాని ఆవిష్కరించిన సర్పంచ్ గడ్డం చిన్నారెడ్డి, ఈ సందర్భంగా గ్రామ ప్రజలందరికీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్. ఈ కార్యక్రమంలో సెక్రటరీ, కారోబార్, వార్డ్ మెంబెర్స్, అంగన్వాడీ టీచర్, మహిళా సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సామాజిక తెలంగాణ సాధన అమరులకు నిజమైన నివాళి

- **ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో సామాజిక సమతుల్యత అవసరం**



**చట్టం సిద్దిపేట ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారుల సంఘం సిద్దిపేట ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రంగధాంపల్లి చౌరస్తాలో ఉన్న అమరవీరుల స్థూపం, రైతు బజార్ సమీపంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం జిల్లా ప్రెస్ క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరులు, ఉద్యమకారులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల గుర్తింపు కమిటీని ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. అయితే కమిటీ నియామకంలో అన్ని సామాజిక వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పిస్తూ మరింత సామాజిక సమతుల్యత పాటించాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లో వివిధ ప్రజా సంఘాలు, వేదికలు, రాజకీయ పక్షాలతో అఖిలపక్ష సమావేశాలు నిర్వహిస్తే ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ మరింత పారదర్శకంగా, సులభంగా సాగుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం రూపొందించిన నిబంధనలతో పాటు అదనపు ఆధారాలను పరిగణనలోకి తీసుకుని నిజమైన ఉద్యమకారులను గుర్తించాలని కోరారు. ఉద్యమ కాలంలో సేవలందించిన అమరుల కుటుంబాలు, ఉద్యమకారుల కుటుంబాల ప్రస్తుత జీవన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని నిజమైన తెలంగాణ ఉద్యమకారుల వివరాలను సేకరించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. నియోజకవర్గాల వారీగా అన్ని వర్గాలు, వేదికలకు చెందిన ప్రతినిధులతో స్టీరింగ్ కమిటీలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి నుంచి ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఉద్యమ కాలంలో ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాల్లో పనిచేసి వివిధ కారణాలతో ఉద్యోగాలు కోల్పోయిన వారిని తిరిగి ఆయా శాఖల్లో నియమించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఉద్యమంలో భాగస్వాములైన కళాకారులకు సముచిత న్యాయం చేయాలని, గుర్తింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. త్వరలోనే సమగ్ర వివరాలతో కూడిన వినతిపత్రాన్ని ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడు పొన్నం ప్రభాకర్‌కు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సత్తయ్య, పాపయ్య, తిరుపతి రెడ్డి, కర్రోల్ల రవిబాబు, ఖమ్మంపల్లి యాదగిరి, శ్రీహరి, పోచబోయిన శ్రీహరి యాదవ్, పెద్దిరాజు, చంద్రబాను, దప్పు బాబు తదితరులు పాల్గొన్నారు.

## మాసాయిపేటలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



**చట్టం మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని మాసాయిపేట మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ చావిడి, గ్రామపంచాయతీ, తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, గ్రంథాలయం, అంగన్‌వాడీ కేంద్రం, జడ్‌పీహెచ్ఎస్ హైస్కూల్‌లలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన సుదీర్ఘ ఉద్యమం ఫలితంగా ఏర్పడిన రాష్ట్రం నేడు అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని పేర్కొన్నారు. విద్య, వ్యవసాయం, మౌలిక వసతులు, సంక్షేమ రంగాల్లో తెలంగాణ సాధిస్తున్న ప్రగతి దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. రానున్న రోజుల్లో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, మేధావులు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మండలంలోని హకీంపేట్, అచ్చంపేట, బొమ్మారం, నాగసాన్‌పల్లి, కొప్పులపల్లి, చెట్ల తిమ్మాయిపల్లి, స్టేషన్ మాసాయిపేట, పోతంశెట్టిపల్లి గ్రామాల్లో కూడా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించి జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం స్వీట్లు పంచుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, గ్రామస్థులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ అమరుల త్యాగస్ఫూర్తిని స్మరించుకుంటూ వేడుకలను విజయవంతం చేశారు.

## జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి దళిత సమస్యలపై వినతిపత్రం



**చట్టం మెదక్ ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మెదక్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఇన్‌చార్జి మంత్రి, కార్మిక మరియు గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ని దళిత ప్రతినిధులు కలిసి పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి బాధితులకు మంజూరైన సుమారు రూ.59 లక్షల పరిహార నిధులు గ్రాంట్ పెండింగ్ కారణంగా ఇంకా విడుదల కాలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బాధితులకు న్యాయం జరిగేలా నిధులు విడుదల చేయాలని కోరారు.అదేవిధంగా మెదక్ జిల్లాలో నిర్మించనున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన్ కు సంబంధించిన స్థల కేటాయింపు ప్రక్రియ కూడా పెండింగ్‌లో ఉందని వివరించారు. ఈ అంశంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని త్వరితగతిన పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. సంబంధిత శాఖల అధికారులతో చర్చించి, పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు దళిత ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా మాల మహానాడు అధ్యక్షులు మా సాయిపేట్ మల్లేశం , మెదక్ జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ పాతూరి రాజు , మాలల హక్కుల రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మల మైసయ్య , ప్రభుదాస్ , గడ్డం సిద్ది రాములు , దళిత సంఘాల సామాజిక కార్యకర్తలు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



**చట్టం వెల్దుర్తి :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా వెల్దుర్తి మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ విజయలక్ష్మి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలో భాగంగా తెలంగాణ సాధన కోసం ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలను స్మరించుకుని వారికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాస్, ఆర్ ఐ నర్సింగ్ యాదవ్, కార్యాలయ సిబ్బంది వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## సిద్దిపేట యువకుడి అరుదైన ఘనత

- **JEE అడ్వాన్స్‌డ్‌లో ఆల్ ఇండియా 189వ ర్యాంక్**
- **TG EAPCETలో రాష్ట్ర 38వ ర్యాంక్**



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట పట్టణానికి చెందిన విద్యార్థి కొల్లా మయూఖ్ రెడ్డి జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబర్చి జిల్లా గర్వకారణంగా నిలిచాడు. సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిపల్లి వార్డు నెం.1కు చెందిన వెంకట రామ్ రెడ్డి కుమారుడు మయూఖ్ రెడ్డి ఇటీవల విడుదలైన JEE (Advanced)-2026 ఫలితాల్లో ఆల్ ఇండియా ర్యాంక్ (CRL) 189 సాధించి విశేష ప్రతిభ చాటాడు. అలాగే TG EAPCET-2026 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 38వ ర్యాంక్ సాధించి మరో ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. దేశంలోని అత్యున్నత ఇంజినీరింగ్ విద్యాసంస్థలైన ఐఐటీలలో ప్రవేశానికి నిర్వహించే JEE అడ్వాన్స్‌డ్ పరీక్షలో ఆల్ ఇండియా స్థాయిలో 189వ ర్యాంక్ సాధించడం విశేషంగా నిలిచింది. అదే సమయంలో రాష్ట్ర స్థాయి ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష అయిన TG EAPCETలో కూడా అత్యుత్తమ ర్యాంక్ సాధించడం మయూఖ్ రెడ్డి కృషి, పట్టుదల, విద్యాపట్ల అంకితభావానికి నిదర్శనంగా మారింది. ఈ విజయంపై కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, మిత్రులు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ, జిల్లా యువతకు ఆదర్శంగా నిలిచిన మయూఖ్ రెడ్డిపై అన్ని వర్గాల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

## పెంచిన నిత్యావసర వస్తువుల ధరలు వెంటనే తగ్గించాలి : గడిపె మల్లేశ్



**చట్టం సిద్దిపేట ప్రతినిధి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామసభల ద్వారా అర్హులైన పేదలను ఎంపిక చేసి అందించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, హుస్నాబాద్ మాజీ వైస్ ఎంపీపీ గడిపె మల్లేశ్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్ వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని అన్నారు. నిత్యావసర వస్తువుల విషయంలో కృత్రిమ కొరత సృష్టించి ధరలను పెంచుతున్నారని, పెరుగుతున్న ధరలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ధరలను నియంత్రించి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్‌కుమార్, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి రోళ్ళ భాగ్య, సీపీఐ మండల నాయకులు ఎనగందుల లక్ష్మీనారాయణ, పిట్టల మొగిలయ్య, బింగి సమ్మయ్య, అయిలేని మల్లారెడ్డి, మహ్మద్ అంకుశావలి, గుంటిపెల్లి లక్ష్మి, దొంతరబోయిన రాజవ్వ, పెద్ది నిర్మల, చొక్కం ఎల్లవ్వ, దొంతరబోయిన రజిత తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- **మహనీయులకు ఘనంగా నివాళులు**



**చట్టం శంషాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శంషాబాద్ పట్టణంలో సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఉన్న మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... తొలి దశ, మలిదశ ఉద్యమకారులు, అమరవీరుల ఆశయ సాధన కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఉద్యమాభివందనాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్టర్ జూనియర్ అసిస్టెంట్ నసీరుద్దీన్, గోపాలకృష్ణ, సాయి, రమేష్, రాజ్ కుమార్, సుధాకర్ ముదిరాజ్, శ్రీనివాస్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, రవి, రాజు, శివరాజ్, శ్రీనివాస్, వెంకటేష్, ఖయ్యూం, ప్రియాంక, సంతోష్ కుమార్, ప్రకాష్ చారి, భాస్కర్, సిద్దు ముదిరాజ్, శ్రీశైలం, వినయ్ రెడ్డి, ప్రవీణ్, ఖలీల్, నరసింహ, నరేష్, శ్రీనివాస్, శ్రీలత, మాజిత్, షరీఫ్, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుడు ముక్కు నరసయ్యకు ఘన సన్మానం



**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అలైబలై ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో తెలంగాణ ఉద్యమకారుడు ముక్కు నరసయ్యను ఘనంగా సత్కరించారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని సోహెబ్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఈటల రాజేందర్, చింత సాంబమూర్తి, పాశం యాదగిరి, దరువు ఎల్లన్న, మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీనారాయణతో పాటు పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో విశేష పాత్ర పోషించిన ఉద్యమకారులు, అలాగే కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో సేవలందించిన ఉద్యోగులను జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో చురుకుగా పాల్గొని విశేష సేవలందించిన ముక్కు నరసయ్య సేవలను గుర్తించి జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## అత్యవసర సమయంలో రక్తదానం చేసి ప్రాణం కాపాడిన అబ్దుల్ హనీఫ్



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** కామారెడ్డి జిల్లాలో అత్యవసర పరిస్థితిలో చికిత్స పొందుతున్న రాజు అనే వ్యక్తికి రక్తం అవసరం కావడంతో, సామాజిక సేవలో ఎప్పుడూ ముందుండే అబ్దుల్ హనీఫ్ వెంటనే స్పందించి రక్తదానం చేశారు. ఇప్పటికే పలు సందర్భాల్లో రక్తదానం చేసిన అబ్దుల్ హనీఫ్, ఈసారి చేసిన దానంతో తన 18వ రక్తదానం పూర్తి చేశారు. అత్యవసర సమయంలో స్పందించి రక్తదానం చేయడం ద్వారా మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. స్థానిక ప్రజలు మరియు రోగి కుటుంబ సభ్యులు అబ్దుల్ హనీఫ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆయన సేవా భావాన్ని అభినందించారు. "రక్తదానం మహాదానం... మీ ఒక్క రక్తదానం ఎవరికో కొత్త జీవితాన్ని అందించగలదు."

CHATTAM NEWS

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

## సిద్దిపేట జిల్లా నూతన విద్యాధికారికి యువ నాయకుల అభినందనలు



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట జిల్లా నూతన విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన వరగంటి శాస్త్రికి జిల్లాలోని యువ నాయక బృందం ఆత్మీయ స్వాగతం పలికి అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా టీఎస్‌సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షుడు దేవరాజ్ శశి యాదవ్, జిల్లా కార్యదర్శి, ఎస్సీఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కాల్వ సురేశ్, రాష్ట్ర కార్యదర్శి మన్నే హేమచంద్ర, టీజీసీపీఎస్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు బండి నర్సింలు, ఆర్‌యూబీపీటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీగాథ రమేష్‌తో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు మాడుగుల శివరాజం, తిరుమలేశ్, తిక్క చంద్రమౌళి, పొన్నమల్ల హరికృష్ణ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా విద్యా అభివృద్ధికి కృషి చేస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని వారు ఆకాంక్షించారు. నూతన బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని కోరుతూ తమ పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

## సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం అనేక త్యాగాలు, సుదీర్ఘ పోరాట ఫలితంగా ఆవిర్భవించిందని పేర్కొన్నారు. తెలంగాణ సాధన కోసం జరిగిన శాంతియుత ఉద్యమంలో శాంతిభద్రతలను పరిరక్షించడంలో పోలీసు వ్యవస్థ కీలక పాత్ర పోషించిందని అన్నారు. పోలీస్ శాఖ అత్యంత క్రమశిక్షణతో కూడిన బలగమని, ప్రతి అధికారి, సిబ్బంది ఆ క్రమశిక్షణను నిరంతరం పాటించాలని సూచించారు. తాము ధరించే ఖాకీ యూనిఫాం సమాజం తమపై ఉంచిన నమ్మకం, బాధ్యతలకు ప్రతీక అని పేర్కొన్నారు. యూనిఫాం గౌరవం, ప్రతిష్టను కాపాడేలా నిబద్ధతతో విధులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్, అదనపు డీసీపీ (ఏఆర్) సుభాష్ చంద్రబాబు, ఇన్‌స్పెక్టర్లు, కమిషనరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## కౌట(బి)వి.డి.సి.ఆధ్వర్యంలో ట్రిబుల్.ఐ.టి.కిఎంపికైనా విద్యార్థులకు సన్మానం



**చట్టం, బోథ్ :** పదవ తరగతి ఫలితాల్లో అంజరి కోమలి 561/600, జె.శృతిక 559/600మంచి మార్కులు సాధించారు. అదేవిధంగా బాసరట్రిబుల్.ఐ.టి.కి ఎంపిక అయినా సందర్భంగా కౌఠ(బి) వి.డి.సి తరపున మంగళవారం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల కౌఠ (బి)లో సన్మానించి, ప్రైజ్ మనీ, మెమెంటో‌తో అందజేశారు. ఈ సందర్భంగా వి.డి.సి.అధ్యక్షులు పిడుగు అశోక్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మంచి మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానంచేసి, ప్రైజ్ మనీ షీల్డ్ అందజేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని అన్నారు. తల్లిదండ్రులకు, తమ గ్రామానికి, గురువులకుమంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శశిధర్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, నవనీత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, వి.డి.సి. ఉపాధ్యక్షులు రాజుబాబు, రైటర్ సాయన్న, చంద్రమోహన్ చిన్నయ్యలు, మాజీ ఉపసర్పంచ్ చిలకాడి రవీందర్ పాల్గొన్నారు.

## నాబార్డ్ ఆర్థిక సాయంతో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు

**బీమా చేసుకోండి.. ధీమాగా ఉండండి**




**చట్టం – భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో మంగళవారం వరంగల్ డీసీసీ బ్యాంక్ నూతన శాఖ ఆధ్వర్యంలో, నాబార్డ్ ఆర్థిక సహకారంతో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం (ఎఫ్ఎల్‌సీ) నిర్వహించారు. ఈ సందర్భంగా వై. రమేష్ కళాజాతర బృందం నుక్కడ్ నాటకం ప్రదర్శించి ప్రజలకు బ్యాంకింగ్ సేవలు, పొదుపు, బీమా పథకాలపై అవగాహన కల్పించింది. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ప్రతిభ మాట్లాడుతూ బ్యాంకు ఖాతాల ప్రాముఖ్యత, పొదుపు అలవాటు అవసరం, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (PMJJBY), ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన (PMSBY) ప్రయోజనాలు, అలాగే బ్యాంకు ద్వారా అందిస్తున్న వివిధ రకాల రుణ సౌకర్యాల గురించి వివరించారు. ముఖ్య అతిథులుగా సర్పంచ్ చాట్ల విజయ, సంపెల్లి నరసింగరావు పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ బీమా పథకాలు, బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ గట్ల విక్రమ్, ప్యాక్స్ సెక్రటరీ అప్పం సాగర్, సొసైటీ సిబ్బంది, రైతులు, మహిళలు, యువత, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కళాజాతర బృందం ప్రజల్లో ఆర్థిక అవగాహన పెంపొందించేందుకు పలు సందేశాలను అందించింది. ఈ సందర్భంగా ప్రజలు పొదుపు అలవాటు పెంపొందించుకోవడంతో పాటు ప్రభుత్వ బీమా పథకాలలో చేరి ఆర్థిక భద్రతను సాధించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## నెల్లూరు పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన నవీన్ రెడ్డి



**వెల్దుర్తి, చట్టం ప్రతినిధి :** నెల్లూరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా గత నాలుగు సంవత్సరాలుగా విధులు నిర్వహించిన బలరామకృష్ణ బదిలీ కావడంతో, నూతన కార్యదర్శిగా నవీన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రంగారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పాలకవర్గం బలరామకృష్ణకు వీడ్కోలు పలికి, నవీన్ రెడ్డికి ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నవీన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకుల సూచనలు, సలహాలు స్వీకరిస్తూ పై అధికారుల ఆదేశాల మేరకు విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, మౌలిక వసతుల కల్పనతో పాటు సమగ్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణరెడ్డి, గుర్రం రాజు, ముదిగొండ శేఖర్, శ్రీనివాస్ గౌడ్, అంజిరెడ్డి, నిరంజన్ రెడ్డి, బాబు, వార్డు సభ్యులు భాస్కర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి ఆదర్శంగా సిద్దిపేట అభివృద్ధి : జిల్లా కలెక్టర్ హైమావతి



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** జిల్లా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ జిల్లా అభివృద్ధిలో ప్రతి అధికారి భాగస్వామి కావాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి పిలుపునిచ్చారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ, సిద్దిపేట జిల్లా దేశానికి ఆదర్శంగా నిలిచే విధంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. గ్రామీణ, పట్టణాభివృద్ధి రంగాల్లో దేశస్థాయిలో ప్రకటించే అనేక అవార్డుల్లో సిద్దిపేట జిల్లా అగ్రస్థానంలో నిలుస్తోందని తెలిపారు. భవిష్యత్తులో కూడా జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింత విజయవంతం అయ్యేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ప్రభుత్వ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా అభివృద్ధి కోసం అందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్‌ఓ నాగరాజమ్మ, కలెక్టరేట్ పరిపాలన అధికారి రాజ్‌కుమార్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్య వైద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంది

- **ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**
- **రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు (ప్రోటోకాల్, ప్రజా సంబంధాల శాఖ అధికారి ) హర్కర వేణుగోపాలరావు**





**చట్టం రామకృష్ణాపూర్ (మంచిర్యాల):** రాష్ట్రంలోని ప్రజల సంక్షేమం, అభివృద్ధి కొరకు ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్, ప్రజా సంబంధాల శాఖ అధికారి హర్కర వేణుగోపాలరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్యలతో కలిసి మంచిర్యాల పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మినిమం వేజ్ బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య లతో కలిసి హాజరై పోలీసు గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాలలు వేశారు. ఈ సందర్భంగా ప్రగతి సందేశాన్ని అందిస్తూ... ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కొరకు అహర్నిశలు శ్రమిస్తుందని, రైతులు, మహిళల సంక్షేమాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, విద్య, వైద్య రంగాల బలోపేతానికి కృషి చేస్తూ ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సౌకర్యం కొరకు సకల సదుపాయాలు కల్పిస్తుందని తెలిపారు. అనంతరం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు మంజూరైన మోటారు సైకిళ్ళు, ల్యాప్ టాప్ లు, వీల్ చైర్లు ఇతరత్ర అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ఆలపించిన గీతాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజల గుండె చప్పుడు... పోరాటానికి ప్రతీక... అభివృద్ధికి చిరునామా హరీష్ రావు

- **తెలంగాణ రాజకీయాల్లో ఒక ప్రత్యేక అధ్యాయం**



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** ఉద్యమంలో అడుగులు... అభివృద్ధిలో ముద్రలు... ప్రజల హృదయాల్లో స్థానం. చరిత్రలో కొన్ని తేదీలు కేవలం క్యాలెండర్‌లోని రోజులు కావు. అవి ఒక ఉద్యమాన్ని, ఒక భావజాలాన్ని, ఒక నాయకత్వాన్ని గుర్తు చేస్తాయి. జూన్ 3 అలాంటి రోజు. తెలంగాణ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న మాజీ ఆర్థిక, ఇరిగేషన్ శాఖ మంత్రి హరీష్ రావు జన్మదినం. తెలంగాణ రాజకీయాలను పరిశీలిస్తే ఉద్యమ కాలం, రాష్ట్ర నిర్మాణ కాలం, అభివృద్ధి కాలం, ప్రతిపక్ష రాజకీయాల కాలం అనే నాలుగు దశల్లోనూ తన ఉనికిని చాటుకున్న నాయకుడిగా హరీష్ రావు కనిపిస్తారు. ఆయన రాజకీయ ప్రస్థానం కేవలం ఒక నాయకుడి ఎదుగుదల కథ మాత్రమే కాదు. తెలంగాణ సమాజంలో చోటుచేసుకున్న రాజకీయ, సామాజిక, ఆర్థిక మార్పులకు అద్దం పట్టే ప్రయాణం.

**ఉద్యమం పిలిచినప్పుడు ముందున్న నాయకుడు**

తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడుతున్న రోజుల్లో ప్రతి గ్రామం ఒక సభగా మారింది. ప్రతి విద్యార్థి ఒక ఉద్యమకారుడిగా నిలిచాడు. ఆ రోజుల్లో ఉద్యమాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లిన నాయకుల్లో హరీష్ రావు ఒక ప్రధాన పేరు.ఉద్యమం అంటే కేవలం ప్రసంగాలు కాదు. ప్రజల కష్టాలను అర్థం చేసుకోవడం, వారి ఆశయాలను తన ఆశయాలుగా మార్చుకోవడం. తెలంగాణ కోసం జరిగిన ప్రతి కార్యక్రమంలో, ప్రతి నిరసనలో, ప్రతి ప్రజా యాత్రలో ఆయన చురుకైన పాత్ర పోషించారు. తెలంగాణ ప్రజలు కోరింది కేవలం ఒక రాష్ట్రం కాదు. స్వాభిమానం, స్వయంపాలన, సమాన అభివృద్ధి. ఆ ఆశయాల సాధనలో ఆయన చేసిన కృషిని అనేక మంది ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు.

**రాష్ట్రం వచ్చాక మొదలైన అసలైన పరీక్ష**

ఉద్యమం గెలవడం ఒక దశ. కానీ కొత్త రాష్ట్రాన్ని నిర్మించడం మరో పెద్ద సవాలు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజల్లో అపారమైన అంచనాలు నెలకొన్నాయి. నీళ్లు కావాలి, నిధులు కావాలి, ఉద్యోగాలు కావాలి, అభివృద్ధి కావాలి. ఈ అంచనాలను కార్యరూపంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం ముందుకు వచ్చినప్పుడు కీలక బాధ్యతలు చేపట్టిన నాయకుల్లో హరీష్ రావు ఒకరు. ముఖ్యంగా సాగునీటి రంగంలో ఆయన చూపిన చొరవ తెలంగాణ రాజకీయ చర్చల్లో ప్రత్యేక స్థానం సంపాదించింది. ఒకప్పుడు వర్షాధారంగా వ్యవసాయం సాగించిన ప్రాంతాల్లో నీటి వనరులు అందుబాటులోకి రావడం, చెరువుల పునరుద్ధరణ, వ్యవసాయానికి ప్రాధాన్యత పెరగడం వంటి అంశాలు అభివృద్ధి చర్చల్లో తరచూ ప్రస్తావనకు వస్తుంటాయి.

**రైతు చిరునవ్వులో కనిపించిన రాజకీయ తత్వం**

తెలంగాణలో రైతు అనే పదం కేవలం ఒక వృత్తిని సూచించదు. అది ఒక జీవన విధానం. రైతు బాగుంటే గ్రామం బాగుంటుంది. గ్రామం బాగుంటే రాష్ట్రం బాగుంటుంది అనే భావనతో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇచ్చిన నాయకత్వంలో హరీష్ రావు కీలక పాత్ర పోషించారు. వ్యవసాయానికి నీరు, పెట్టుబడి, భరోసా అందించాలనే లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమాలు గ్రామీణ రాజకీయాల్లో ప్రభావం చూపించాయి. ప్రతి ఎకరాలో పచ్చదనం కనిపించినప్పుడు, ప్రతి రైతు ఆశతో విత్తనం వేసినప్పుడు అభివృద్ధి అనే పదానికి కొత్త అర్థం కనిపించిందని ఆయన అభిమానులు చెబుతుంటారు.

**సిద్దిపేట: ఒక నియోజకవర్గం కాదు... ఒక నమూనా**

ఒక నాయకుడి సామర్థ్యాన్ని అంచనా వేయాలంటే ఆయన ప్రాతినిధ్యం వహించిన ప్రాంతాన్ని చూడాలని అంటారు. ఆ కోణంలో చూస్తే సిద్దిపేట తరచూ చర్చకు వస్తుంది.గ్రామీణ మౌలిక సదుపాయాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య సేవలు, పచ్చదనం, చెరువుల అభివృద్ధి, తాగునీటి సౌకర్యాలు వంటి రంగాల్లో జరిగిన మార్పులు సిద్దిపేటను ప్రత్యేకంగా నిలబెట్టాయి. రాజకీయ ప్రత్యర్థులు వేరే అభిప్రాయం వ్యక్తం చేసినా, సిద్దిపేట అభివృద్ధి గురించి చర్చ జరిగినప్పుడు హరీష్ రావు పేరు తప్పనిసరిగా వినిపిస్తుంది.

**అధికారంలో ఉన్నప్పుడు నాయకత్వం... ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోరాటం**

రాజకీయాల్లో అధికారంలో ఉన్నప్పుడు పనిచేయడం ఒక పరీక్ష అయితే, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజలతో అనుబంధాన్ని నిలబెట్టుకోవడం మరో పరీక్ష. అధికార మార్పు తర్వాత తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది. ప్రజల అంచనాలు, ప్రభుత్వ విధానాలు, ఎన్నికల హామీలు, సంక్షేమ కార్యక్రమాలు రాజకీయ సంభాషణలో ప్రధాన అంశాలయ్యాయి. ఈ సందర్భంలో హరీష్ రావు ప్రతిపక్ష నాయకుడిగా తన పాత్రను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేయడం, ప్రజా సమస్యలను ప్రస్తావించడం, రైతులు, యువత, ఉద్యోగులు, సాధారణ ప్రజల అంశాలను లేవనెత్తడం ద్వారా రాజకీయ చర్చలో తన ఉనికిని కొనసాగిస్తున్నారు.

**కార్యకర్తల నాయకుడు**

రాజకీయ పార్టీలు నాయకులతో కాకుండా కార్యకర్తలతో బలపడతాయి. ఈ విషయాన్ని బాగా అర్థం చేసుకున్న నాయకుడిగా హరీష్ రావు గుర్తింపు పొందారు. గ్రామస్థాయి కార్యకర్త నుంచి రాష్ట్రస్థాయి నాయకుడి వరకు అందరితో సన్నిహితంగా ఉండటం, కష్టకాలంలో అండగా నిలవడం, పార్టీ కోసం శ్రమించిన వారిని గుర్తించడం ఆయన రాజకీయ శైలిలో ముఖ్య లక్షణాలు. అందుకే ఆయనను అనేక మంది కేవలం నాయకుడిగా కాకుండా "అన్న"గా సంబోధిస్తారు.

**తెలంగాణ రాజకీయాల్లో భవిష్యత్తు పాత్ర**

రాజకీయాలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కానీ ప్రజలతో అనుబంధం కలిగిన నాయకత్వం కాలంతో పాటు మరింత బలపడుతుంది. ఉద్యమ అనుభవం, పరిపాలనా అనుభవం, ప్రజలతో సాన్నిహిత్యం, రాజకీయ చాతుర్యం — ఈ నాలుగు అంశాలు కలిసిన నాయకత్వంగా హరీష్ రావు పేరు తరచూ ప్రస్తావనకు వస్తోంది. భవిష్యత్తులో తెలంగాణ రాజకీయాల్లో ఆయన పాత్ర ఎలా ఉండబోతుందనేది రాజకీయ విశ్లేషకుల చర్చలో తరచూ వినిపించే ప్రశ్న.

**ముగింపు**

కొన్ని పేర్లు పదవులతో గుర్తింపు పొందుతాయి... కొన్ని పేర్లు ప్రజల ప్రేమతో చిరస్థాయిగా నిలిచిపోతాయి. రాజకీయాలు గెలుపోటముల ప్రయాణం కావచ్చు. పదవులు రావచ్చు... పోవచ్చు... ప్రభుత్వాలు మారవచ్చు. కానీ ప్రజల గుండెల్లో స్థానం సంపాదించడం మాత్రం అరుదైన విషయం.

## తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి: జాగీర్ సత్యనారాయణ




**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రజా ఉద్యమాలు నిర్వహించిన ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే అమలు చేయాలని సీపీఐ హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అనేక మంది ఉద్యమకారులు పోలీసు కేసులు ఎదుర్కొని ఇబ్బందులు పడ్డారని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వారిని గుర్తించడంలో విఫలమైందని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కల్పించి ఇంటి స్థలం, పెన్షన్ తదితర సౌకర్యాలు అందిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి 28 నెలలు గడిచినా ఆ హామీలు అమలుకాలేదని, కమిటీల పేరుతో కాలయాపన చేయడం సరికాదన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమకారులతో కలిసి ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్, ఎండి అంకుశవలి, వలవోజు జగదీశ్వరాచారి, గుంటిపెల్లి లక్ష్మి, ఎలూరి స్వాతి, రోల్ల భాగ్య, చోక్కం ఎల్లవ్వ, గూడ పద్మ, జనగాం రాజ్‌కుమార్, ఎనగందుల లక్ష్మీనారాయణ, పిట్టల మొగిలయ్య, బింగి సమ్మయ్య, అయిలేని మల్లారెడ్డి, దొంతరబోయిన రాజవ్వ, పెద్ది నిర్మల, దొంతరబోయిన రజిత తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**చట్టం భీంగల్ :** నిజామాబాద్ జిల్లా భీంగల్ పట్టణంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఆత్మగౌరవ పతాకం సగర్వంగా ఎగిరిన చారిత్రక రోజు ఇదేనని పేర్కొన్నారు. నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షలు, అనేకమంది ఉద్యమకారుల త్యాగాలు ఫలించి తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని తెలిపారు. ఉద్యమ నాయకత్వం, సబ్బండ వర్గాల పోరాట స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్లపాటు సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా పాలన సాగిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య, మాజీ ఎంపీపీ ఆర్మూర్ మహేష్, మాజీ జెడ్పీటీసీ చౌటుపల్లి రవి, సొసైటీ చైర్మన్ శివసారి నరసయ్య, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మోయిజ్, కౌన్సిలర్లు బోదిరే నరసయ్య, నీలం రవి, మల్లెల ప్రసాద్, గున్నాల భగత్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనపూర్ లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**చట్టం, తూప్రాన్;** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు తూప్రాన్ మండలంలోని ఘణపూర్ గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ సబ్బని వెంకటేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సబ్బని వెంకటేష్ మాట్లాడుతూ ఎందరో అమరుల త్యాగాల ఫలితంగా ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. మహానుభావుల ఉద్యమాలు, త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. ఘనపూర్ గ్రామ అభివృద్ధి సంక్షేమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రత్యేకత, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వేడుకల్లో భాగంగా తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ నజీమా బేగం, గ్రామ కార్యదర్శి సంఘమేశ్వర్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రైతులకు సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలి: సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్



**చట్టం, అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం బచ్చువారిగూడెం పంచాయతీ పరిధిలోని ప్రాజెక్టు, రేగడిగుంపు గ్రామాల్లో మంగళవారం సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ గ్రూప్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి మిర్రియాల నాగేశ్వరావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్, మండల కార్యదర్శి వాసం బుచ్చిరాజు పాల్గొని మాట్లాడారు. అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేఎస్) జాతీయ కమిటీ పిలుపు మేరకు జూన్ 1 నుంచి 8 వరకు దేశవ్యాప్తంగా రైతు సమస్యలపై నిరసనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులు, నాసిరకం పురుగుల మందుల బారిన పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను అందుబాటులో ఉంచడంతో పాటు రైతులకు సబ్సిడీపై సరఫరా చేయాలని కోరారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో సాగు పనులు వేగవంతం కావడానికి అవసరమైన విత్తనాలను వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య మండల కార్యదర్శి కంగాల చిన్న వంగరావు, పూసం శారద, ముద్దుగొండ దుర్గారావు, జెట్టి భీమరాజు, జెట్టి లక్ష్ముడు, ఆశి ముత్తమ్మ, పులి సుజాత, కొమరం ముత్తమ్మ, జెట్టి కన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కిష్టాపూర్ లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**చట్టం, తూప్రాన్;** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు తూప్రాన్ మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ చుక్క హిమబిందు శ్రీశైలం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చుక్క హిమబిందు శ్రీశైలం మాట్లాడుతూ ఎందరో అమరుల త్యాగాల ఫలితంగా ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. ఉద్యమాలు, త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. కిష్టాపూర్ గ్రామ అభివృద్ధి సంక్షేమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రత్యేకత, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వేడుకల్లో భాగంగా తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బక్కని రవీందర్, గ్రామ కార్యదర్శి, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించిన కౌన్సిలర్ జైపాల్ రాథోడ్



**చట్టం, తూప్రాన్;** మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటి పట్టణంలోని నాలుగో వార్డ్ లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లును 4వ వార్డు కౌన్సిలర్ రాథోడ్ జైపాల్ నాయక్ ప్రారంభించారు. జైపాల్ నాయక్ మాట్లాడుతూ 4వ వార్డు అభివృద్ధి కి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. వార్డు ప్రజలు పార్టీల కతీతంగా అభివృద్ధి కి సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ మహేష్, ప్రసన్నకుమార్, రవిశంకర్, నరేష్, ఇంద్రమ్మ ఇల్లు లబ్ధిదారులు అచ్చంపేట నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by SIRIGADA PRASAD and Printed at INDUR OFFSET PRINTERS, Opposite Cheer Hanuman Temple, Weekly Bazar, Nizamabad District,Telangana 503001., and Published at: H.No. 3-3-486/2, Gayathrinagar, Varni road, Nizamabad District, Telangana - 503001..Editor: SIRIGADA PRASAD. RNI.No. TELTEL/2010/32350. Cell ;9948884497. prasadsirigada27@gmail.com